## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:316 | బుధవారం జూన్ 17, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్

## నేడు ప్రారంభించనున్న సిఎం రేవంత్

### రేపటి భవిష్యత్ కోసం నా మానసపుత్రిక అంటూ సిఎం ట్వీట్



రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ స్కూల్‌ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతా వేదికగా సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ' 'భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది'.. అన్నది ఇకపై ఒక నినాదం మాత్రమే కాదు.. కళ్ల ముందు కనిపించే నిజం. ఆ నిజానికి సాక్ష్యం ఆరుట్లలోని 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'. మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రాయాలన్న నా సంకల్పానికి రూపం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' అని పేర్కొన్నారు. చరిత్ర పుటల్లో కలిసిపోతున్న సర్కారు బడి ప్రజా పాలనలో నేడు మళ్లీ పూర్వ వైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలతో, ఆధునిక వసతులతో, పిల్లల మేధో వికాస్ క్షేత్రంగా నిలవబోతోంది. తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా రూపుదిద్దుకున్నది. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనోవికాసం వికసించేలా, మట్టిలో మాణిక్యాలను తీర్చి దిద్దే సకల హంగులతో రూపుదిద్దుకున్న నా మానస పుత్రిక ఈ పాఠశాల. 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'కు రూపం ఇచ్చే కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. విద్యార్థులకు అభినందనలు. ఆరుట్లలో ఆవిష్కృతమవుతున్న నేటి ఈ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఆరంభం మాత్రమే. తెలంగాణ వ్యాప్తంగా భవిష్యత్‌లో వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పడం తదుపరి మా కర్తవ్యం' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# 'ఆయనో పెద్ద జోక్'..

## కాంగ్రెస్- డీఎంకేల మధ్య ముదిరిన వైరం





**రాహుల్ గాంధీపై డీఎంకే ఘాటు విమర్శలు చేస్తూ "పెద్ద జోక్"గా అభివర్ణించింది. తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడాన్ని డీఎంకే వెన్నుపోటుగా పేర్కొంది.**

**ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌తో పొత్తును డీఎంకే రద్దు చేసుకుంది.**

**ప్రతిపక్ష పార్టీల ఐక్యతను బలహీనపరుస్తున్నది రాహుల్ గాంధీయేనని డీఎంకే ఆరోపించింది.**

**ఇండియా కూటమిలోని విభేదాలకు కాంగ్రెస్ వైఖరే కారణమని మురసోలి**

కాంగ్రెస్– తమిళనాడు డీఎంకే ల మధ్య వైరం రోజురోజుకి పెరుగుతోంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై డీఎంకే ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆయన పెద్ద జోక్ అంటూ ఎగతాళి చేసింది. ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యతను రాహుల్ బలహీనపరుస్తున్నారంటూ విమర్శలు గుప్పించింది.

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఐదు సీట్లు నెగ్గిన కాంగ్రెస్.. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)కు మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. దీన్ని డీఎంకే (ఐవీఖ) వెన్నుపోటుగా అభివర్ణించింది. దీంతో ఆ పార్టీతో పొత్తును రద్దు చేసుకుంది.

పేజి 2లో ▶

## సర్ పేరుతో రెండు మతాల మధ్య

# కాంగ్రెస్ చిచ్చు



2లో

# చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ



- దశలవారీగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ
- 18న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమం

రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

పేజి 2లో ▶

# బీసీ బాలికల విద్యకు భరోసా

- 6 గురుకుల పాఠశాలల అప్‌గ్రేడ్
- ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభం
- ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు
- అధ్యాపకుల నియమకానికి చర్యలు
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



2లో ▶

# తెలంగాణ అభివృద్ధిపై మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు: కిషన్‌రెడ్డి

దిల్లీ: దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి (ఖఱంఱుఘఅ తీవసంఎ) అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి (=వఱుత్ష్ర =వసంఎ) విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు.

**మాకు రేవంత్ సర్టిఫికెట్ అవసరం లేదు**

"తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్–1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది.

2లో



- హైదరాబాద్ మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

**మెట్రో ఫేజ్-1 కోసం కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసిందన్నారు.**

- ప్రాజెక్టులను అడ్డుకునే సంస్కృతి భాజపాకు లేదని వ్యాఖ్యానించారు.
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకరిస్తోందని స్పష్టం చేశారు.
- రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు దిగజారుడు రాజకీయాలేనని విమర్శించారు.

# ఆంధ్రప్రదేశ్ నుంచే 'వీబీ - జీ రామ్ జీ' పథకం ప్రారంభం

- జూలై 1న ఏపీ నుంచి జాతీయ పథకం ప్రారంభం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పవన్ కళ్యాణ్ భేటీ
- రాష్ట్ర ఆవిష్కరణ నమూనా ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకం
- పనులన్నీ జియో-ట్యాగింగ్ విధానంతో పూర్తి
- ఏపీకి రికార్డు స్థాయిలో రూ.7,700 కోట్ల నిధులు

విజయవాడ, జూన్ 16 :



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'వీబీ – జీ రామ్ జీ' జాతీయ ప్రారంభోత్సవం 2026 జూలై 1న ఆంధ్రప్రదేశ్ నుంచి జరుగుతుందని కేంద్ర మంత్రి ప్రకటించారు.

2లో

# అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలు



- రాష్ట్రంలో తగ్గిన నేరాల శాతం
- మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం
- గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం
- సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం
- పోలీసు సంక్షేమానికి కీలక నిర్ణయాలు

అమరావతి, జూన్ 16

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి



2లో ▶

# సంపాదకీయం

## విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరిగేదెలా?

మే మాసాంతంలో దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి చాలా మేరకు నిరాశాజనకంగా ఉన్నది. జూన్ ఆరంభంలో ప్రభుత్వం విధానపరమైన చర్యలు చేపట్టింది. వీటిలో భాగంగా ప్రవాస భారతీయులు, అర్హత కలిగిన విదేశీ సంస్థలు నిర్దిష్ట భారత ప్రభుత్వ సెక్యూరిటీలలో ఎలాంటి పరిమాణాత్మక పరిమితులు లేకుండా పెట్టుబడి పెట్టేందుకు అనుమతించే 'ఫుల్లీ యాక్సెసబుల్ రూట్' అనే విధానాన్ని కొత్తగా 15, 30, 40 సంవత్సరాల ప్రభుత్వ బాండ్లకూ విస్తరిస్తున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. విదేశీ పోర్ట్ ఫోలియో మదుపుదారులపై ఇప్పటివరకు ఉన్న నిర్దిష్ట పరిమితులు, గరిష్ఠ పరిమితులను కూడా తొలగించారు. విదేశీ మదుపుదారులను దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5శాతం పన్ను చెల్లింపు నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వ బాండ్ల విక్రయంపై 20శాతం పన్నును నిలిపివేస్తున్నట్టు కూడా ఆ ఆర్డినెన్స్ ప్రకటించింది. ప్రవాస భారతీయులు, భారతీయ సంతతికి చెందిన విదేశీ పౌరులు మొదలైనవారికి ఉద్దేశించిన ఖీజచీ=(దీ) డిపాజిట్లను సేకరించేందుకు కూడా బ్యాంకులకు ఆర్బీఐ అనుమతినిచ్చింది.

ఇవన్నీ ప్రశస్త చర్యలు, సందేహం లేదు. గతంలో వాటిని అమలుపరిచినప్పుడు, మంచి ఫలితాలనిచ్చినవిగా నిరూపితమయ్యాయి. ప్రస్తుత క్లిష్టపరిస్థితులలో అవి దేశంలోకి విదేశీ కరెన్సీల ప్రవాహాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలను 30 నుంచి 40 బిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు పెంపొందించవచ్చని అంచనా. విదేశీ మారక ద్రవ్య నిల్వల పెరుగుదల రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు అవకాశమున్నది. చిక్కిపోతున్న రూపాయి మన గౌరవనీయ ప్రధానమంత్రికి ఒక రాజకీయ సమస్యగా పరిణమించింది. డాలర్--రూపాయి మారకం విలువను రూ.40గా నియంత్రిస్తామని 2014లో ఆయన హామీ నిచ్చారు. ఉవ్వెత్తున ఎగసిన కడలి తరగను అలా నిలిచిపోవాలని కింగ్ కాన్యూట్ ఆదేశించిన చందంగా మన ప్రధానమంత్రి వాగ్దానమూ ఉన్నది సుమా!

సరే, ప్రభుత్వం చేపట్టిన చర్యలతో నష్టాలు వాటిల్లే అవకాశమూ ఉన్నది. ఆ నష్టాలేమిటో మనం ఇప్పుడు తర్కించనవసరం లేదు. ఎందుకంటే ప్రభుత్వానికి, ఆర్బీఐకి ఆ చర్యలు చేపట్టడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. ఆ చర్యలు అసలు చేపట్టకపోతే జరిగే నష్టం మరింత అధికంగా ఉంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా సంక్షోభంలోకి జారిపోతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం చాలా నెలలుగా, మరీ ముఖ్యంగా ట్రంప్ సుంకాలు, ఇరాన్‌పై అమెరికా-- ఇజ్రాయెల్ యుద్ధం, భగ్గుమన్న చమురు ధరలు, సరఫరా గొలుసులు విచ్ఛిన్నమైన నాటి నుంచి ఆ నిరాకరణ స్వరం మరింత హెచ్చింది. భారత్‌లో మదుపు చేసే విషయంలో విదేశీ మదుపుదారులు చాలా జాగ్రత్త వహిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు తగ్గిపోవడం, దేశం నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోవడం మొదలైన పరిణామాలు ముంచుకొస్తున్న ముప్పును స్పష్టంగా సూచించాయి. అయినా ఆ ప్రమాద ఘంటికలను ప్రభుత్వం పట్టించుకోనేలేదు.

2022--23 ఆర్థిక సంవత్సరం నుంచి స్థిర ధరల వద్ద గ్రాస్ ఫిక్స్‌డ్ కేపిటల్ ఫార్మేషన్ (స్థూల స్థిర మూలధన నిర్మాణం జీఎఫ్‌సీఎఫ్) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 32.3శాతంగా మాత్రమే ఉంటోంది. ఈ జీఎఫ్‌సీఎఫ్ ప్రభుత్వ రంగం, గృహరంగం (రియల్ ఎస్టేట్, భవన నిర్మాణం), ప్రైవేట్ రంగాల మధ్య ఇంచుమించు సరిసమానంగా విభజితమై ఉంది. పెట్టుబడులు మరింతగా పెట్టేలా ప్రైవేట్ రంగం దిగ్గజాలను పాలకులు పదే పదే కోరుతున్నారు, బుజ్జగిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారవేత్తలను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్స్ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. అయినా మదుపులు పెట్టేందుకు ప్రైవేట్ రంగం సమ్మతించడం లేదు. ముఖ్యంగా తయారీ రంగంలో మదుపులకు ససేమిరా అంటోంది. స్థిర ధరల వద్ద స్థూల విలువ జోడింపు (జీవీఏ-- గ్రాస్ వాల్యూ యాడెడ్-- ఒక నిర్దిష్ట ప్రాంతం లేదా రంగంలో సరుకుల సేవల నికర విలువను గణించే కొలమానం)లో మాన్యుఫాక్చరింగ్ వాటా ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలో చాలా సంవత్సరాలపాటు 17శాతంగా మాత్రమే ఉన్నది (జీడీపీ= జీవీఏంసరుకులపై నికర పన్నులు).

ఆర్బీఐ నెలవారీ బులెటిన్లు, ఆర్థిక మంత్రిత్వ శాఖ నెలవారీ సమీక్షలు దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు ఆరోగ్యదాయకంగా ఉన్నాయనే సంతృప్తిని కలిగిస్తూ వచ్చాయి. అయితే ఈ బులెటిన్లు, సమీక్షలూ మరీ ఆశాజనకంగా ఉన్నాయని, యథార్థ పరిస్థితులను కప్పిపుచ్చుతున్నాయని, ముంచుకొస్తున్న ముప్పును సరిగ్గా గుర్తించడం లేదని చాలామంది ఆర్థికవేత్తలు మొత్తుకుంటూనే ఉన్నారు. వ్యవస్థాగత బలహీనతలను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వ ప్రతినిధులు వాక్చాతుర్యం ప్రదర్శిస్తున్నారని కూడా పలువురు ఆర్థికవేత్తలు తీవ్రంగా ఆక్షేపించారు.

ప్రస్తుత సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు చేపట్టిన చర్యలతో ప్రభుత్వం సంతృప్తితో మిన్నకుండిపోతే అంతకు మించిన పొరపాటు మరొకటి ఉండబోదు. ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ ఒక ఇంటర్వ్యూలో ఆర్థిక వ్యవస్థ విషయమై ప్రభుత్వ ప్రస్తుత ఆలోచనా విధానాన్ని సంగ్రహించి చెప్పారు. బంగారం దిగుమతులపై పరిమితులు విధించడాన్ని గురించి అడిగిన ఒక ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానమివ్వకుండా, 'బంగారం దిగుమతులపై పరిమితులు విధించిన విషయం తనకు తెలియదని' అన్నారు! అనంత నాగేశ్వరన్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు. దేశానికి సంబంధించిన సమస్త ఆర్థిక వ్యవహారాలపై ఆయనకొక దృక్పథం ఉండి తీరాలి. కీలక ఆర్థిక కార్యకలాపాలపై ప్రభుత్వానికి సలహా ఇవ్వడం ఆయన బాధ్యత. మరి బంగారం దిగుమతులపై పరిమితులు విధించిన విషయం ఆయనకు తెలియకపోవడమేమిటి? ఈ అంశంపై ఆయన గుంభనంగా మాట్లాడారు.

కారణమేమిటి? యూపీఏ ప్రభుత్వం తన తుదినాళ్ల (2013--14)లో బంగారం దిగుమతులపై పరిమితులు విధించినప్పుడు నరేంద్ర మోదీ ఇలా ప్రతిస్పందించారు: 'ఆర్థికమంత్రి మీ మంగళసూత్రాలను అపహరిస్తున్నారు'. నాటి మోదీ విమర్శలు తెలిసి ఉన్న కారణంగానే అనంత నాగేశ్వరన్ అలా మాట్లాడి ఉండవచ్చు. అయినా బంగారం దిగుమతులకు అడ్డంకులు సృష్టించడం మినహా ప్రభుత్వానికి మరో మార్గం లేదు అనే విషయాన్ని కూడా ఒప్పుకుని తీరాలి.

మరింత ముఖ్యమైన విషయమేమిటంటే గృహ సంబంధిత రుణాలు జీడీపీలో 41శాతానికి పెరిగిపోగా పొదుపు మొత్తాలు జీడీపీలో 6శాతానికి తగ్గిపోయాయి. తక్కువ పొదుపులు పారిశ్రామిక పెట్టుబడులకు అందుబాటులో ఉన్న దేశీయ మూలధనాన్ని పరిమితం చేస్తాయి. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ పెట్టుబడులపై మరింత ఆధారపడవలసిరావడం అనివార్యమవుతుంది. విలాస వస్తువులను కొనుగోలు చేసే చాలా తక్కువ మంది సంపన్నులలో మినహా వినియోగ వ్యయమూ బాగా తగ్గిపోయింది. ఎమ్ఓఎస్‌పీఐ (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్-- గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ) వివిధ అంశాలపై వెల్లడించే అంకెలను పాలకులు విశ్వసించకుండా ఉండడం మంచిది. ఆ గణాంకాలు తమ పాలనా దక్షతకు అద్దం పడుతున్నాయని ప్రకటించుకోవడమూ పాలకులకు సరికాదు. చెప్పవచ్చినదేమిటంటే స్థూల ఆర్థిక గణాంకాలపై ఆధారపడడం అభివృద్ధిలో అసమానతను కప్పిపుచ్చుతుంది.

ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం చేయవలసినదేమిటి? ప్రభుత్వ వ్యయాలను నేరుగా పెంచాలి లేదా ప్రజల చేతుల్లోకి మరింతగా డబ్బు చేర్చాలి. ఇందుకు అనేక మార్గాలు ఉన్నాయి: ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి; వినియోగంపై పన్నులు తగ్గించాలి. గ్రేట్ నికోబార్ కాంటైనర్ పోర్ట్ --కమ్-- ఎయిర్‌పోర్ట్ లాంటి పర్యావరణ హానికరమైన ప్రాజెక్టులకు స్వస్తిచెప్పాలి; విద్యా రుణాలను మరింతగా పెంచాలి. గ్రామీణ ఉపాధిహామీ పథకం తదితర శ్రమ--సాంద్ర ప్రజా ప్రయోజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి మరిన్ని నిధులు వాటికి కేటాయించాలి. త్రాగునీరు, గ్రామీణ రహదారులు, గ్రామీణాభివృద్ధి పథకాలు, పట్టణ గృహ నిర్మాణం మొదలైన వాటికి కేటాయించిన నిధులను గత ఆర్థిక సంవత్సరం (2025--26)లో వలే కాకుండా సంపూర్ణంగా ఖర్చు చేయాలి. మంజూరు చేసిన ప్రభుత్వోద్యోగాలలో ఖాళీలను, ప్రత్యేకించి క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాలు, డాక్టర్లు, ఉపాధ్యాయులు,

## బీసీ బాలికల విద్యకు భరోసా

మొదటిపేజీ తరువాయి

**అమరావతి, జూన్ 16 (సదా మీకోసం):**
బీసీ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయనగరం జిల్లా కొత్తవలస, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గోలగముడి, ఆత్మకూరు, అన్నమయ్య జిల్లా కలికిరి, వైఎస్సార్ కడప జిల్లా ఓనిపెంట, శ్రీ సత్యసాయి జిల్లా నాసనకోట గురుకులాలను జూనియర్ కళాశాలలుగా మార్చినట్లు పేర్కొన్నారు.

**గ్రూపునకు 40 మందికి అవకాశం**

నూతన విద్యా సంవత్సరం నుంచే ఈ ఆరు గురుకుల కళాశాలల్లో మొదటి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని, ఎనిమిది మంది అధ్యాపకులను పార్ట్ టైమ్ పద్ధతిలో నియమించనున్నామని వివరించారు. వారితో పాటు ఒక కుక్, ల్యాబ్ అసిస్టెంట్‌ను అవుట్‌సోర్సింగ్ విధానంలో తీసుకుంటామని, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లే కళాశాల ప్రిన్సిపాళు ్లగా వ్యవహరిస్తారని చెప్పారు.

**శాశ్వత భవనాల నిర్మాణం**

నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు లభిస్తుండడంతో ఎంజేపీ గురుకులాల్లో చదవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని మంత్రి సవిత తెలిపారు. బాలికల విద్యకు వెన్నుదన్నుగా నిలిచినందుకు సీఎం చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. త్వరలో రూ.500 కోట్లతో పది ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నట్లు వివరించారు.

## 'ఆయనో పెద్ద జోక్'..

### కాంగ్రెస్- డీఎంకేల మధ్య ముదిరిన వైరం

మొదటిపేజీ తరువాయి

ఈ విషయంపై డీఎంకే ఐటీ విభాగం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. 'కాంగ్రెస్ రాజకీయ ఉనికి కోసం పోరాడుతుండగా.. మేం వారిని మా భుజాలపై మోశాం. కానీ.. ఒక కొత్త బొమ్మ రాగానే వారు మాకు హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయారు' అని రాసుకొచ్చింది. ఈసందర్భంగా రాహుల్‌ను ఒక పెద్ద జోక్‌గా అభివర్ణించింది. ఇదే సమయంలో డీఎంకే అధికారిక పత్రిక మురసోలి తన సంపాదకీయంలో రాహుల్‌పై విమర్శలు గుప్పించింది. ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు తలెత్తడానికి ఆ కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది.

ప్రశ్నపత్రాల లీక్‌లు.. యువత కలలకు ఎదురుదెబ్బ

ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. 'ఐక్యత గురించి రాహుల్ తెగ ఉపన్యాసాలు ఇచ్చేస్తున్నారు. కానీ పలు రాష్ట్రాల్లో ఆ ఐక్యతను బలహీనపరిచింది ఎవరు?' అని ప్రశ్నించింది. కేరళలోని వామపక్ష పార్టీలు ఆయనపై చేసిన విమర్శలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. రాహుల్‌కు రాజకీయ పరిపక్వత, స్థిరత్వం లేకపోవడమే కూటమిలో విభేదాలకు కారణమని అభిప్రాయపడింది. కూటమిలో ప్రస్తుతం ఉన్న అనేక సమస్యలు కాంగ్రెస్ సొంత చర్యల నుంచే మొదలయ్యాయని పేర్కొంది. ఈ విమర్శలపై కాంగ్రెస్ అధికారికంగా స్పందించలేదు. అయితే, తమిళనాడు ప్రజల తీర్పునకు అనుగుణంగానే పార్టీ వ్యవహరించిందని కాంగ్రెస్ వర్గాలు ఈ ఆరోపణలను తోసిపుచ్చాయి.

## ఆంధ్రప్రదేశ్ నుంచే 'వీబీ - జీ రామ్ జీ' పథకం ప్రారంభం

దేశంలోని అన్ని రాష్ట్రాల మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందులో పాల్గొంటారని తెలిపారు. ఏపీ ఆదర్శ పంచాయతీల నమూనాలను దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

**నిధుల మద్దతు - ప్రగతి**

రాష్ట్రంలో అవినీతి లేకుండా అన్ని పనులకు జియో-ట్యాగింగ్, ముఖ గుర్తింపు విధానం పూర్తి చేశామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇళ్లు, రోడ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని చెప్పారు. ఈ పథకం కింద ఏపీకి రూ. 7,700 కోట్ల నిధులు ఇచ్చినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ అభివృద్ధిని అభినందించిన కేంద్ర మంత్రి, అన్ని విధాలా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సాధికారత**

ఈ పథకం కింద రాష్ట్రంలో కాఫీ తోటల పెంపకాన్ని చేర్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తీర ప్రాంతాల్లో ఆదర్శ పంచాయతీల అభివృద్ధికి, 'లక్ పత్ దీదీ' మహిళా గ్రూపుల వాహనాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపిందని అధికారులు పేర్కొన్నారు. జూన్ 28, 29 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయ సదస్సుకు పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఈ సమావేశంలో రోహిణి ఆర్. భజిభకరే, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధిపై మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు.

**తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడా**

తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. ఢిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలే. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం" అని కిషన్‌రెడ్డి వివరించారు.

## సర్ పేరుతో రెండు మతాల మధ్య కాంగ్రెస్ చిచ్చు

మొదటిపేజీ తరువాయి

మానకొండూర్: సర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ రెండు మతాల మధ్య చిచ్చు పెడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ముంజంపల్లిలో మంగళవారం ఆయన భాజపా నాయకులు, ఆర్‌ఎంపీలతో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ విదేశీ ముస్లిం చొరబాటుదారులను, మన దేశ ముస్లింలతో పోల్చి అవమానిస్తోందని ధ్వజమెత్తారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి ఓటరు కార్డు పొందితే ఆ ఓట్లను తొలగించాలా వద్దా కాంగ్రెస్ స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మన దేశ ముస్లింలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలన్నారు.

## అవకాశాలకు నెలవు అమరావతి

అంతర్జాతీయ మౌలిక వసతులతో నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సరికొత్త ఆలోచనలతో రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సింగపూర్‌లో రెండవ రోజు పర్యటనలో భాగంగా ఆయన 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్ షిప్ ప్లీనరీ-2లో పాల్గొని 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటివి అమరావతికి ప్రత్యేకత తీసుకువస్తాయని వివరించారు.

**ప్రపంచస్థాయి నగరం**

అమరావతిని ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈక్విటీ, నేచర్, ఆపర్చ్యునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందన్నారు. కృష్ణా నది పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా రూపుదిద్దుకుంటోందని, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా నిలుస్తుందని చెప్పారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, జస్టిస్, టూరిజం, హెల్త్ వంటి థీమ్ లతో రాజధానిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సైక్లింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా నిర్మాణం జరుగుతోందన్నారు.

**రైతుల త్యాగం**

ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ఒకే ఒక్క పిలుపుతో రాజధాని నిర్మాణం కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని చంద్రబాబు కొనియాడారు. ఆ భూములను అభివృద్ధి చేసి కొంత భాగాన్ని రైతులకు తిరిగి ప్లాట్లుగా ఇచ్చామని వివరించారు. 25 ఏళ్ల క్రితం తాను ఐటీ భవిష్యత్‌ను ఆరోజే ఊహించి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవడం వల్లే ఇవాళ తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో అందరికన్నా ముందున్నారని పేర్కొన్నారు.

**సంపద సృష్టి**

నాడు తాను నిర్మించిన సైబరాబాద్ నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని చంద్రబాబు గుర్తుచేశారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే, నేడు ఎకరం రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందని చెప్పేందుకు సైబరాబాద్ నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతో మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు లభించిందని, ఇప్పుడు ఏఐ గురించి ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

**స్టాల్స్ సందర్శన**

ప్రసంగం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఇన్నోవేటర్స్ అలేలో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను పరిశీలించి, టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను తెలుసుకున్నారు.

## అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలు

మొదటిపేజీ తరువాయి

విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సుమారు 14.1 శాతం మేర తగ్గిందని పేర్కొన్నారు. 'శక్తి యాప్' ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర కాల్స్ అందాయని, వాటిపై తక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 8,396 మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చినట్లు వివరించారు.

**మత్తుపదార్థాల నిర్మూలన**

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' ద్వారా అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్కులపై దాడులు చేసి, 56,674 గంజాయి కేసులు నమోదు చేశామని మంత్రి అనిత తెలిపారు. 2,366 మందిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు సైబర్ వార్ రూమ్స్ ఏర్పాటు చేశామని, 1930 హెల్ప్‌లైన్ ద్వారా సుమారు రూ. 247 కోట్ల ప్రజల సొమ్మును మోసగాళ్ల బారిన పడకుండా రక్షించగలిగామని చెప్పారు. అత్యవసర సేవల్లో పోలీసుల స్పందన సమయం 30 నిమిషాల నుండి 10 నిమిషాల లోపుకు తగ్గిందని వివరించారు.

**పోలీసుల సంక్షేమం**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం 6,000 మందికి పైగా పోలీసు నియామకాలు, 505 మంది అధికారులకు పదోన్నతులు కల్పించామని మంత్రి తెలిపారు. కానిస్టేబుల్ శిక్షణార్థుల స్టైపెండ్‌ను రూ. 4,000 నుండి రూ. 7,500కు పెంచినట్లు పేర్కొన్నారు. నేరస్థులకు శిక్షలు ఖరారయ్యేలా ప్రాసిక్యూషన్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా 279 కీలక కేసుల్లో విజయవంతమైన తీర్పులు వచ్చాయని, అందులో 8 మందికి మరణదండన, ముగ్గురికి యావజ్జీవ శిక్ష పడిందని వివరించారు. విపత్తు నిర్వహణలో భాగంగా 26 ఎన్డీఆర్ఎఫ్, 22 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో ప్రాణనష్టం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హోం శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ కుమార విశ్వజిత్, అధికారులు పాల్గొన్నారు.

## చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ

మొదటిపేజీ తరువాయి

చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. అంతకుముందు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి.

**రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (ఆర్టిఐఏఎస్)-రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్**



డా,, కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005




రంగారెడ్డి జిల్లా న్యూస్ (జూన్ 16)జనసముద్రం

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే "ఫీజుల నియంత్రణ చట్టం" తీసుకురావాలని ఆర్టిఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.విద్యా వ్యాపారమే పరమావధిగా సాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల ధనదాహానికి సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా డా,, కొర్ర. కిషన్ నాయక్ మాట్లాడుతూ... ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు.విద్యా ప్రమాణాలను పెంచడం పక్కన పెట్టి,కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యాసంస్థలను నడుపుతున్నారని విమర్శించారు.
ప్రభుత్వ అనుమతులు లేకుండా,విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్,టై,బెల్ట్,మరియు యూనిఫామ్‌లను విక్రయిస్తూ ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నాయని మండిపడ్డారు.
బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు ఈ వస్తువులను పాఠశాలల్లోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయం అని అన్నారు.
కళ్ళ ముందే ఇంతటి దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.
ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను క్రమబద్ధీకరించడానికి తక్షణమే ఒక బలమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి.
నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు,యూనిఫామ్‌లు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి.
ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను,నిబంధనలను పారదర్శకంగా బోర్డులపై ప్రదర్శించేలా చూడాలి.
సామాన్యుడికి విద్యను దూరం చేస్తున్న ఇటువంటి వ్యాపార ధోరణిపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి,తనిఖీలు చేపట్టాలని సూచించారు.

# కూకట్పల్లి డివిజన్ పరిధిలో సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం

జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూన్ 17



కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తో కలిసి మంగళవారం రోజున ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై సమీక్షించడంతో పాటు అధికారుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫతేనగర్ డివిజన్ హరిజన బస్తిలోని జిహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.
సమావేశానికి ముందు క్షేత్రస్థాయి పరిశీలన
దీనదయాళ్ నగర్ బ్రిడ్జ్ సమావేశానికి వచ్చే ముందు దీనదయాళ్ నగర్ బ్రిడ్జ్ ఎత్తు పెంచే పనులపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఎండిపి ప్రాజెక్టు అధికారి శ్రీమతి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, బ్రిడ్జి పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కి హామీ ఇచ్చారు.
ఆర్‌యుబి రోడ్ అండర్ బ్రిడ్జి అనంతరం ఎమ్మెల్యే ఆర్‌యుబి పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా సాగుతుండడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
శివ నగర్ శివ నగర్‌లో ఆర్‌యుబి నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని అక్కడి ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
సమీక్షా సమావేశంలో ప్రధానాంశాలు
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, "కావాలని కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసింది. అదేవిధంగా ఫతేనగర్ డివిజన్‌ను కూడా మూడు ముక్కలు చేయడం జరిగింది. దీనివల్ల ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలన్నా అధిక ఖర్చుతో పాటు సమయం వృధా అవుతోంది. ఇది ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్య" అని విమర్శించారు.
సమావేశంలో స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు:
పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు వీధిలైట్లు వెలగకపోవడం సమస్య చాలా ఉందన చెత్త సేకరణ సరిగ్గా జరగకపోవడం ప్రధానస్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టాలి
మంచినీటి సరఫరా సరిగ్గా లేకపోవడం
వీటిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గారు, అక్కడే ఉన్న అధికారులను ప్రజల కోరిక మేరకు అవసరమైన నిధులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# ప్రభుత్వ విద్యతోనే అందరికి ఉన్నత భవిష్యత్తు..

**విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్.**

మిర్యాలగూడ పట్టణం.జూన్ 16.(జనసముద్రం న్యూస్):



విద్యార్థుల చదువుల కొరకు లక్షల రూపాయలు ఫీజులు కట్టి తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని కావున ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యను వినియోగించుకోని పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ పిలుపునిచ్చారు,ఇట్టి సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్యతోపాటు అనేక సంక్షేమ పథకాలు ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ బడుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు మరియు మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్య పుస్తకాలు యూనిఫాం వంటి అన్ని వసతులు ఉన్నాయని పిల్లల ప్రతిభకు స్కూల్ పేరుతో సంబంధం లేదని అన్నారు,ప్రభుత్వ పాఠశాలల తోనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు అని ప్రభుత్వ పాఠశాలల నుంచి చదివిన ఎంతోమంది నేడు డాక్టర్లు ఇంజనీర్లు కలెక్టర్లుగా స్థిరపడ్డారని ఆయన గుర్తుచేశారు,ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల కోసం కట్టే లక్షల రూపాయలను పిల్లల పేరు మీద పొదుపు చేస్తే వారి పై చదువులకు ఉపయోగపడుతుందని కావున తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాల కళాశాలలో చేర్పించాలని మన బడి మన బాధ్యత అని మారం శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# వల్భాపూర్ విద్యార్థుల సమస్యలపై ఎన్‌హెచ్ అధికారుల సానుకూల స్పందన

**ప్రత్యేక శ్రద్ధ చూపిన గ్రామ ఉపసర్పంచ్ అనిల్ కుమార్**

ఎల్కతుర్తి, జూన్ 16: (జనసముద్రం)





హనుమకొండ జిల్లాఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఆర్ ఫార్మసీ కళాశాల వద్ద విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎన్‌హెచ్ అధికారులు సానుకూలంగా స్పందించారు.గ్రామ ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మంగళవారం జాతీయ రహదారి అధికారులను కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.కళాశాల ముందు ఉన్న డివైడర్ కారణంగా బస్సులు ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్లిపోతుండటంతో విద్యార్థులు కళాశాల వద్ద దిగలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.దీంతో డివైడర్ కటింగ్ చేయడంతో పాటు విద్యార్థుల కోసం బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే వల్భాపూర్ గ్రామానికి ఏర్పాటు చేయాల్సిన సైన్‌బోర్డును పొరపాటున కోతులనడుమ పేరుతో ఏర్పాటు చేసిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గ్రామం పేరుతో సరైన నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామానికి సంబంధించిన ఇతర రహదారి సమస్యలను కూడా అధికారులకు వివరించారు.ఈ అంశాలపై స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు డివైడర్ కటింగ్, నేమ్‌బోర్డు ఏర్పాటు, బస్ షెల్టర్ నిర్మాణం వంటి అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వల్భాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్, వార్డ్ సభ్యుడు అంబాల కిషోర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్పంచ్ వివాహ వేడుకలు...

వెల్దండ,జూన్,17(జనసముద్రం న్యూస్)



మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ స్వగృహంలో మంగళవారం పెళ్లి వేడుకలను పురస్కరించుకుని వార్డు సభ్యుల సమక్షంలో శాలువా కప్పి, కేక్ కట్ చేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి గిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి రషీద్, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, పసునోజు వాణి పురుషోత్తం, ముదికొండ కవిత రమేష్, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, బాదేపల్లి రమేష్, జంగిలి సునీత ఆనంద్,రేవల్లి మానస రాజు, ఎస్. శేఖర్, జి. రాఘవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు,

# ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుంది





జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.

ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని, స్వీయ రక్షణకు విద్యార్థినులు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. సీనియర్ కరాటే మాస్టర్ సీ. జగదీశ్వర్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థిని విద్యార్థులకు వివిధ బెల్ట్ గ్రేడింగ్ లో పోటీలను నిర్వహించారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై బ్లాక్ బెల్ట్, వివిధ రకాల బెల్ట్ లు మరియు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన మార్పులతో శరీరానికి శ్రమ లేకపోవడంతో ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోజూ కొంత సమయం ఆటలతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణకు కేటాయించాలని సూచించారు. బాలికలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ మాస్టర్ ప్రవీణ్, తల్లిదండ్రులు మహేష్, శ్రీను నాయక్, అశోక్, మహేష్, భాస్కర్, హరీష్. తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్ శ్రీనివాసులు

వెల్దండ,జూన్,17(జనసముద్రం న్యూస్)



మండల పరిధిలోని చేర్యాకర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు, అనంతరం సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు, విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయులు చెప్పే పాఠలను శ్రద్ధగా విని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు, అలాగే మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ బాలరాజు,పాఠశాల హెచ్ఎం మౌనిక,కేశమోని జంగయ్య,అల్లే సందీప్ తదితరులు పాల్గొన్నారు

# భద్రకాళి ఆలయంలో వైభవంగా ధాన్యాదివాసం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఎల్కతుర్తి జూన్ 16(జనసముద్రం)



వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా మంగళవారం ధాన్యాదివాసం, ఫల, పుష్ప, శయ్యాదివాస కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేష ఆధ్వర్యంలో వేదపండితులు, ఋత్విక్కులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.బ్రహ్మశ్రీ గణేశ ఆత్రేయ శర్మ నిర్వహించిన ఆగమ శాస్త్ర క్రతువులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ప్రసాదం స్వీకరించారు.సాయంత్రం నిర్వహించిన ధాన్యాదివాసం, ఫల, పుష్ప, శయ్యాదివాసాలు, నీరాజనం, మంత్రపుష్పం, మహాప్రసాద వితరణతో తొలి రోజు కార్యక్రమాలు ముగిశాయి.బుధవారం ఉదయం 8.36 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు ఆలయ ధర్మకర్తలు, దాతలు, భక్తులు పాల్గొననున్నారు.ధ్వజస్తంభ ప్రతిష్ఠ దర్శనం మహా పుణ్యప్రదమని అర్చకులు పేర్కొంటూ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# ఎల్కతుర్తి కీర్తి పతాకం ఎగరేసిన యువ బాక్సర్ ఆఫ్రిన్

**ప్రోత్సాహం అందితే దేశ స్థాయిలో రాణిస్తా: ఆఫ్రిన్**

ఎల్కతుర్తి జూన్ 16(జనసముద్రం)




హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని మహ్మద్ ఆఫ్రిన్ జాతీయ స్థాయి అండర్-15 బాక్సింగ్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటింది. మహ్మద్ హుస్సేన్, యాకుబి దంపతుల కుమార్తె అయిన ఆఫ్రిన్ ప్రస్తుతం శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది.చిన్నతనం నుంచే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకున్న ఆఫ్రిన్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందింది.ఇటీవల హైదరాబాద్‌లోని గౌలిపురలో మిత్రా వారియర్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి. పోటీలకు అర్హత సాధించింది.ఈ సందర్భంగా బాక్సింగ్ కోచ్ దేవరకొండ ప్రభుదాస్ ఆఫ్రిన్‌ను అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆఫ్రిన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం, ఆర్థిక సహాయం అందితే దేశ స్థాయిలో మరింత మెరుగైన ప్రతిభ కనబరుస్తానని తెలిపింది.జూన్ 20, 21 తేదీల్లో పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి అండర్-15 బాక్సింగ్ పోటీల్లో ఆఫ్రిన్ తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుంది. ఆమె ఎంపిక పట్ల ఎల్కతుర్తి మండల ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్

జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.



అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో,మంగళవారం సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్,ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ లు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, ప్రయివేట్ కంటే దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. నేటి పోటీ కాలంలో విద్యార్థులు కష్టం అనకుండా ఇష్టపడి చదివి, తల్లిదండ్రులతో పాటు గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వప్న .టీచర్ సంతోషి రాథోడ్.వార్డు మెంబర్లు సీతారాం నాయక్.సితి భాస్కర్.పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి. అంగన్వాడీ టీచర్లు సరోజ.నుసారత్ బేగం తదితరులు పాల్గొన్నారు

# విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు,

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16, 2026: తెలంగాణ**





రాష్ట్రంలో విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల-కళాశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో వి.ఓ. భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి ప్రభుత్వ భూముల ఆక్రమణపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహనరంగా విగ్రహ భూమి పూజ

**జనసముద్రంన్యూస్ అశ్వారావుపేట:**



విజయవాడ బెబ్బులి స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంగళవారం పట్టణంలోని రింగ్ రోడ్డు సెంటర్ వద్ద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భూమి పూజను మండల అధ్యక్షులు కురిశెట్టి నాగబాబు నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఉపాధ్యాయుల సూర్యప్రకాష్ రావు పారతో మట్టిని తవ్వి పనులను ప్రారంభించారు. దాతల సహాయంతో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని త్వరగా తిన పూర్తి చేస్తామని నాయకులు తెలిపారు. జులై నెలలో వంగవీటి మోహనరంగా కుమారుడు వంగవీటి రాధా తో విగ్రహావిష్కరణ చేయడం జరుగుతుందని నాగబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్స్ దండా బత్తుల ఆదిలక్ష్మి, అట్టం రమ్య, కొట్టే నాగ సునీత, వెంకన్న బాబు, ఊట్లపల్లి సర్పంచ్ సత్యం లక్ష్మి కుమారి, లైన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లి రవి, చిలకల గండి ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ నరాల శ్రీనివాసరావు, కట్ట శ్రీను, పాశం రామారావు, బండారు శ్రీనివాసరావు, చిన్నంశెట్టి నాగు,చిన్నంశెట్టి పవన్, దండా బత్తుల నరేష్, కొట్టే శ్రీను, చిన్నంశెట్టి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# రాణిగంజ్ డిపో నూతన డిపో మేనేజర్ రవీంద్ర సార్‌తో మర్యాదపూర్వక భేటీ --





### ప్రజా సమస్యల పరిష్కారానికి సహకారం హామీ

**మల్కాజిగిరి జనసముద్రం న్యూస్ జూన్ 16**

రాణిగంజ్ డిపోలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిపో మేనేజర్ రవీంద్ర సార్‌ను ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా డిపో పరిధిలో ప్రజలకు అందుతున్న రవాణా సేవలు, బస్సుల నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాలు మరియు స్థానిక సమస్యలపై సవివరంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

డిపో అభివృద్ధి, ప్రయాణికుల సమస్యల పరిష్కారం మరియు సేవల మెరుగుదలకు పరస్పర సహకారం అందిస్తామని డిపో మేనేజర్ రవీంద్ర సార్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నుండి మహమ్మద్ రషీద్, నజీర్, నూరి బేగం, అలాగే ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నుండి ఎన్ శ్రీనివాస్, జయ, రమాదేవి, మహేష్, సీఎం కృష్ణ, జి శ్రీనివాస్, ఇంద్ర, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులో కూడా కలిసి పనిచేస్తామని సభ్యులు తెలిపారు.

# మంచిర్యాల జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి,

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16, 2026: మంచిర్యాల**



జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య లతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదిగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, అదే రోజున జిల్లాలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2026 వనమహోత్సవం లో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంలో సంబంధిత అధికారులకు అటవీ అధికారులు సహాయం అందిస్తారని, మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అటవీ భూముల తగాదాలు ఉన్నచోట వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం పాలకవర్గం సమావేశంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.





**జనసముద్రం న్యూస్ జూన్ 16 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**

భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగే పాలకవర్గం సమావేశంలో పాల్గొని పాలకవర్గ సభ్యులకు భద్రాచలం అభివృద్ధికి కోరకు ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు సూచనలు, చేశారు. అభివృద్ధి పనులు ఏ విధంగా అమలు చేయాలోసలహాలు తెలియజేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు . ఈ సందర్భంగా

మాట్లాడుతూ సర్పంచ్ పూనెం కృష్ణ కి మరియు వార్డ్ మెంబెర్స్ కు పంచాయతీ జూా కి తగు సూచనలు ఇస్తూ జరిగే అభివృద్ధి పనులపై చర్చించారు..

ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు చెంచు సుబ్బారావు, బొంబోతుల రాజీవ్, బొంత రమణ, బండారు శరత్ బాబు, నర్రా వాణి, అబ్బినేని వీనిల రాణీ, కావూరి గోపి, పెద్దినేని లక్ష్మి, కారం సుజాత, నిట్టా రాజు, భుక్య సుశీల, కారం దుర్గారావు, తాటి ఉదయ్, ఇనమల అశోక్, సున్నం ఈశ్వరి, సున్నం భూలక్ష్మి, జగ్గా కుమారి, తుర్రం మహేష్, ఇర్ప అనసూయ మరియు గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సూచనలతోనైనా భద్రాచలంలో ఉన్న వార్డులలో పర్యటించి అవసరమైన ప్రదేశాలలో పనులు జరిగే విధంగా సర్పం చ్, వార్డు మెంబర్లు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి,

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16, 2026:**






గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ - గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్" -- "వాక్ అలోంగ్ ది లైన్"

### కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎండీ జితేష్ వి. పాటిల్



రాష్ట్రవ్యాప్తంగా మాన్సూన్ సన్నద్ధతలో భాగంగా చేపట్టిన "పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ -- వాక్ అలోంగ్ ది లైన్" కార్యక్రమంలో రెండో రోజు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని ఆనంద్ నగర్ కాలనీలో నిర్వహించిన క్షేత్రస్థాయి తనిఖీలలో పాల్గొన్నారు.

ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల వరకు కొనసాగిన ఈ పర్యటనలో సీఎండీ విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను లైన్-టు-లైన్ సర్వే ద్వారా పరిశీలించి, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్థంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్లు మరియు ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు.తనిఖీల సందర్భంగా గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, పెండింగ్ రెక్టిఫికేషన్ పనులు, లైన్ క్లియరెన్స్ సమస్యలు, దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు విద్యుత్ సరఫరా నాణ్యతపై ప్రభావం చూపే అంశాలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. అలాగే ఫీల్డ్ సిబ్బంది నిర్దేశిత డ్రెస్ కోడ్ పాటిస్తూ, వ్యక్తిగత భద్రతా పరికరాలు (గ్లౌజు), లైన్ టూల్స్ మరియు ఇతర భద్రతా ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు.మాన్సూన్ కాలంలో విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్.టి./హెచ్.టి. నెట్‌వర్క్‌ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని, చెట్ల కొమ్మల కత్తిరింపు, లైన్ క్లియరెన్స్ మరియు నివారణ నిర్వహణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి అధికారి తన పరిధిలో నెట్‌వర్క్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తకముందే నివారణ చర్యలు చేపట్టాలని సీఎండీ సూచించారు."వాక్ అలోంగ్ ది లైన్" కార్యక్రమంలో డీఈ (ఆపరేషన్) సైఫాబాద్ శ్రీ సమ్మయ్య, ఏడీఈలు శ్రీ దుర్గా శ్రీనివాస్, శ్రీ వినోద్ కుమార్, ఏఈ శ్రీ నరసింహతో పాటు ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16, 2026:**





ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న భోజనశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎ ఈ ను ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు మాట్లాడారు. భవనానికి వెంటనే పెయింటింగ్ వేయించాలని, ఆర్ ఓ ప్లాంట్ మరమ్మత్తు చేయించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పన దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలకు మంజూరైన బాలికల మూత్రశాలను వెంటనే నిర్మించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బికార్న దాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, మండల విద్యాధికారి వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి ని కలిసిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు వడ్త్యావత్ శ్రీను నాయక్.

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**



ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వడ్త్యావత్ శ్రీను నాయక్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులతో కలిసి కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాల్లో ఉన్న సమస్యలను వారికి తెలియజేశారు.అలాగే ప్రతి గ్రామపంచాయతీలో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లను ఎక్కువ మొత్తంలో మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు.గ్రామాల్లో అండర్ డ్రైనేజీ,మరియు రోడ్ల సమస్యలను వివరిస్తూ పనులను చేపట్టడానికి అధిక నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి సర్పంచ్ శ్రీను నాయక్ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్,యాట నరసింహ,వివిధ గ్రామ పంచాయితీ సర్పంచులు,మౌనిక శివ, వెంకటయ్య,రాజేశ్వరి మల్లేష్,ఉపసర్పంచ్ కే సురేష్ నాయక్,విజయ్ రాథోడ్ తదితరులు

# న్యూజిలాండ్‌తో డ్రా చేసుకున్న ఇరాన్

## ఈజిప్ట్‌తో 1-1తో డ్రా అయిన బెల్జియం

## సౌదీ అరేబియా, ఉరుగ్వే మ్యాచ్ డ్రా






ఫిఫా వరల్డ్‌కప్ 2026లో తొలి మ్యాచ్‌ల నుంచే అనూహ్య ఫలితాలు నమోదవుతున్నాయి. సోమవారం మూడు మ్యాచ్?లు జరగ్గా, అన్నీ కూడా డ్రానే అయ్యాయి. అయితే ఈ మెగా టోర్నీకి ముందు రాజకీయ వివాదాలు, నిరసనలతో వార్తల్లో నిలిచిన ఇరాన్ జట్టు, మైదానంలోనూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రపంచకప్‌లో అట్టడుగు ర్యాంక్‌లో ఉన్న న్యూజిలాండ్‌తో ఇరాన్ 2-2తో డ్రా కావడంతో నాకౌట్ అవకాశాలకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. మరోవైపు బెల్జియం, ఉరుగ్వే వంటి జట్లు కూడా తమ తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించలేకపోయాయి. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన గ్రూప్-జి మ్యాచ్‌లో ఇరాన్ రెండుసార్లు వెనుకబడినా పోరాడి 2-2తో డ్రా చేసుకుంది. మ్యాచ్ ఏడో నిమిషంలోనే న్యూజిలాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. క్రిస్ వుడ్ ఇచ్చిన పాస్‌ను ఎలిజా జస్ట్ అద్భుతంగా గోల్‌గా మలిచాడు. ఆరంభ షాక్ నుంచి కోలుకున్న ఇరాన్ ఎటాక్ పెంచింది. స్టార్ ఫార్వర్డ్ మెహదీ తారెమీ చేసిన ప్రయత్నం పోస్టును తాకి బయటకు వెళ్లింది. చివరకు 32వ నిమిషంలో రామిన్ రెజాయియాన్ సమం చేశాడు. అయితే ఆ తర్వాత మరోసారి ఎలిజా జస్ట్ గోల్ చేసి న్యూజిలాండ్‌కు ఆధిక్యం అందించాడు. ఇరాన్ ఓటమి దిశగా సాగుతున్న సమయంలో మహమ్మద్ మొహేబీ 64వ నిమిషంలో హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 2-2గా మార్చాడు. చివరి అరగంటపాటు ఇరాన్ ఎటాక్స్ చేసినా విజయం అందుకోలేకపోయింది. దీంతో ప్రపంచకప్ నాకౌట్ దశకు తొలిసారి చేరాలన్న ఇరాన్ ఆశలకు తొలి మ్యాచ్‌లోనే గట్టి దెబ్బ తగిలింది. ఇరాన్ మ్యాచ్‌కు ముందు, తర్వాత రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వందలాది మంది నిరసనకారులు స్టేడియం వెలుపల ఆందోళనలు నిర్వహించారు. ఆ జట్టు ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం లేదని వారు ఆరోపించారు. స్టేడియం లోపల కూడా అభిమానులు ఫిఫా నిబంధనలను ధిక్కరిస్తూ ఆందోళనలకు ముందు ఉపయోగించిన ఇరాన్ జెండాలను ప్రదర్శించారు. టీషర్టులు, బ్యానర్లు, జెండాల రూపంలో అవి కనిపించాయి. జాతీయ గీతం వినిపించినప్పుడు కొందరు అభిమానులు వెనుదిరిగి నిలబడగా, మరికొందరు నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది కొన్ని చోట్ల ఆంక్షలు విధించినప్పటికీ, మ్యాచ్ మొత్తం రాజకీయ సందేశాలు కనిపించాయి. సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. మొహమ్మద్ సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయంపై ఈజిప్ట్ ఆశలు చిగురించాయి. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా అవకాశాలను గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకాకు మైదానంలోకి అడుగుపెట్టిన కేవలం 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ మునియర్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ గోల్ చేయడంతో బెల్జియం సమం చేసింది. చివరి నిమిషాల్లో ఇరు జట్లు విజయం కోసం ప్రయత్నించినా స్కోరు మారలేదు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు. మయామిలో జరిగిన గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో ఉరుగ్వే 1-1తో సౌదీ అరేబియాతో డ్రా అయింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఉరుగ్వే బంతిపై ఆధిపత్యం ప్రదర్శించినా గోల్ చేయలేకపోయింది. 41వ నిమిషంలో అబ్దులెలాహ్ అల్ అమ్రీ గోల్‌తో సౌదీ అరేబియా ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో అర్ధభాగంలో ఉరుగ్వే స్పీడ్ పెంచింది. ఫెడెరికో వాల్వెర్డే, ఫెడెరికో వినాస్ పలుమార్లు అవకాశాలు సృష్టించినా సౌదీ గోల్‌కీపర్ మహ్మద్ అల్ ఓవైస్ అద్భుత సేవ్‌లతో నిలిచాడు. అయితే 80వ నిమిషంలో వినాస్ హెడ్డర్‌ను అడ్డుకున్న గోల్‌కీపర్ నుంచి వచ్చిన రీబౌండ్‌ను మాక్సిమిలియానో అరౌజో గోల్‌గా మలిచి ఉరుగ్వేకు ఊరటనిచ్చాడు. మ్యాచ్ ముగిసే సరికి ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకున్నాయి.

## గొడవపై వైభవ్ సూర్యవంశీకి జరిమానా

కేవలం 15 ఏళ్ల వయసు ఉందని చెప్పి ఎలాంటి ప్రవర్తనకైనా మినహాయింపు లభించదు. భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య మ్యాచ్ అనంతరం సూర్యవంశీ ఓ శ్రీలంక ఆటగాడితో వాగ్వాదానికి దిగినట్లు, అనంతరం అతడిని తోసినట్లు వీడియోల్లో కనిపించింది. భారత్ సూపర్ ఓవర్‌లో ఓడిపోయిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడంతో మ్యాచ్‌పై చర్చ మొత్తం ఈ వివాదం వైపు మళ్లింది. ఈ ఘటనపై న్యూస్18తో మాట్లాడిన మాజీ అంపైర్ అనిల్ చౌదరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటగాళ్లు భౌతికంగా ఒకరినొకరు తాకే పరిస్థితి రావడం సరైంది కాదని, మ్యాచ్ నిర్వహించిన ఫీల్డ్ అంపైర్లు కూడా పరిస్థితిని మరింత సమర్థంగా నియంత్రించాల్సి ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ నిబంధనలు ఏమంటున్నాయి? ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 కింద పరిశీలించే అవకాశం ఉంది. ఈ నిబంధన ప్రకారం మ్యాచ్ సమయంలో ఆటగాడు, సపోర్ట్ స్టాఫ్, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా తాకడం ఉల్లంఘనగా పరిగణిస్తారు. అనిల్ చౌదరి ప్రకారం, వీడియోలో ఆటగాళ్ల మధ్య భౌతిక ఘర్షణ జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోందని, ఇప్పుడు ఈ వ్యవహారంలో మ్యాచ్ రిఫరీ పాత్ర కీలకంగా మారుతుందని చెప్పారు. మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశన్ ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిర్ణయం ఎలా తీసుకుంటారు? ఈ ఘటన వెనుక అసలు కారణాలు ఏమిటి, దాగడం వెనుక ఉద్దేశపూర్వకంగా జరిగిందా లేదా అనుకోకుండా జరిగిందా, దాన్ని నివారించే అవకాశం ఉందా వంటి అంశాలను మ్యాచ్ రిఫరీ పరిశీలిస్తారు. అంపైర్ల నివేదికను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే క్రికెట్ రూల్స్ తీవ్రత ఎంత, ఎదుటి ఆటగాడికి గాయమైందా లేదా, వివాదం ఎంతవరకు వెళ్లింది వంటి అంశాలు కూడా తుది నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. సూర్యవంశీకి ఎలాంటి శిక్ష పడొచ్చు? అనిల్ చౌదరి అభిప్రాయం ప్రకారం, ఈ ఘటనను ఉల్లంఘనగా నిర్ధారిస్తే వైభవ్ సూర్యవంశీపై మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదనంగా ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు కూడా ఇవ్వవచ్చు. తక్కువ తీవ్రత కలిగిన కేసుల్లో అధికారిక హెచ్చరిక లేదా మందలింపు విధించే అవకాశమూ ఉంది. ఒక ఆటగాడు 12 నెలల వ్యవధిలో నాలుగు డీమెరిట్ పాయింట్లు సంపాదిస్తే మ్యాచ్‌ల నుంచి సస్పెన్షన్ విధించే అవకాశం ఉంటుంది. అసలు ఏమి జరిగింది? సూపర్ ఓవర్‌లో భారత్-ఏ జట్టుకు 17 పరుగుల లక్ష్యం లభించింది. అయితే సూర్యాంశ్ షెడ్గే, వైభవ్ సూర్యవంశీ జోడీ కేవలం 9 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో శ్రీలంక-ఏ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానం విడిచివెళ్తున్న సమయంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో సూర్యవంశీ ప్రత్యర్థి బౌలర్ వైపు దూసుకెళ్లి, మధ్యలో జోక్యం చేసుకున్న మరో ఆటగాడిని కూడా తోసినట్లు తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సీనియర్ ఆటగాళ్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.



## రెండో వన్డేలో కుల్దీప్ యాదవ్ రీఎంట్రీ..?




అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం లక్నో వేదికగా జరగనున్న రెండో వన్డేలో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు పర్యాటక అఫ్గానిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను ఆఖరి మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ బలాన్ని పరీక్షించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ సిరీస్‌తోనే టీమిండియా వన్డే ప్రపంచకప్ 2027 సన్నాహకాలను ప్రారంభించింది. మెగా టోర్నీకి కావాల్సిన కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తామని సిరీస్ ప్రారంభానికి ముందే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే రెండో వన్డేలో భారత తుది జట్టులో మార్పులు ఉంటాయనే చర్చ జరుగుతోంది. తొలి మ్యాచ్‌లో సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కాదని హర్ష్‌దూబేను టీమిండియా ఆడించింది. అతను అరంగేట్ర మ్యాచ్‌లోనే (3/47) మూడు వికెట్లతో సత్తా చాటాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చడం, అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్‌లో వికెట్లు తీయకపోవడంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరంగేట్ర పేసర్ మానవ్ సుతార్ ఐదు వికెట్లతో సత్తా చాటగా.. కుల్దీప్ యాదవ్ ఆ స్థాయిలో రాణించలేకపోయాడు. కానీ కుల్దీప్ యాదవ్‌కు వన్డేల్లో మంచి రికార్డ్ ఉంది. ఈ క్రమంలోనే అతన్ని రెండో వన్డేల్లో బరిలోకి దించే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ శర్మ మణికట్టుకు గాయమైంది. మైదానంలోనే చికిత్స తీసుకున్న అతను ఆ తర్వాత ఆట కొనసాగించినా.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌటయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇటీవలే కోలుకున్న రోహిత్.. తొలి వన్డేలో చాలా అసౌకర్యంగా కనిపించాడు. దాంతోనే అతను రెండో వన్డే ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. అతనికి విశ్రాంతి ఇస్తే యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. జైస్వాల్ కూడా చాలా రోజుల నుంచి వన్డే టీమ్‌లో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ధర్మశాల వన్డేలో అరంగేట్రం చేసిన గుర్నూర్ బ్రార్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. మూడు వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించాడు. జట్టులో ఉన్న మరో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ ప్రిన్స్ యాదవ్ ఆఖరి వన్డే వరకు వేచి చూడాల్సిందే. ఒకవేళ అతనికి అవకాశం ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పు జరిగే అవకాశం లేదు.

అఫ్గాన్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు(అంచనా)

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్(కీపర్), వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్,ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్.



## పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉంది: దియా మీర్జా

బాలీవుడ్ నటి దియా మీర్జా వాతావరణ సంక్షోభంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉందని తాను చేసిన వ్యాఖ్యలను దియా మీర్జా సమర్థించుకున్నారు. ఇటీవల సోహా అలీఖాన్ 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో దియా మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ ఆరతికుమార్ రావుతో కలిసి ఎకోఫెమినిజంపై ఆమె చర్చించారు. 'వాతావరణ మార్పు కేవలం పర్యావరణ సమస్య కాదు. ఇది అసమానతల సమస్య కూడా. ఏళ్లుగా పురుషాధిక్య వ్యవస్థలు ప్రకృతిని దోచుకున్నాయి. శతాబ్దాలుగా, పితృస్వామ్య వ్యవస్థలు అధికారాన్ని చేపట్టాయి. సంరక్షణ కంటే దోపిడీకే ప్రాధాన్యమిచ్చి, ప్రకృతిని, బలహీన వర్గాలను దోపిడీకి గురయ్యే వనరులుగా చూశాయి. ఇది పితృస్వామ్య సమాజంలో మహిళలు, బాలికలను చూసే విధానం లాంటిదే' అని ఆమె అన్నారు. 'స్త్రీలను చూసినట్లే అడవులు, నదులను వస్తువుల్లా చూశాయి. వరదలు, కరవు వస్తే మొదట ఇబ్బందిపడేది ఆడవాళ్లు, పిల్లలే. కానీ నిర్ణయాలు తీసుకోవడంలో వారికి చోటు లేదు. ఆధిపత్యం పోయి, కరుణ, సమానత్వం ఉంటేనే పరిష్కారం దొరుకుతుంది' అని ఆమె తేల్చి చెప్పారు.




### వారణాసి బిజీలో మహేశ్‌బాబు

## సందీప్ వంగాతో మూవీపై అప్పుడే క్లారిటీ

సూపర్ స్టార్ మహేశ్ బాబు, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో సినిమా రాబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మహేశ్ బాబు ప్రస్తుతం రాజమౌళితో చేస్తున్న 'వారణాసి', సందీప్ వంగా కమిట్ అయిన 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ఈ కాంబో సెట్ అయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నిజానికి వీరిద్దరి కలయికలో సినిమా రావడం ఇదే మొదటి ఆలోచన కాదు. గతంలో ఏషియన్ సినిమాస్ నిర్మాణంలోనే మహేశ్, సందీప్ వంగా కలిసి 'డెవిల్' అనే సినిమా చేయాల్సి ఉంది. ఆ సమయంలో ఇద్దరికీ ఈ నిర్మాణ సంస్థ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు సమాచారం. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి ఈ ఇద్దరి కాంబినేషన్ కోసం టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మహేశ్ 'వారణాసి' చిత్రం ముగిసిన తర్వాతే ఈ ప్రాజెక్ట్‌పై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరి నిజంగానే ఈ కాంబో సెట్ అవుతుందో లేదో చూడాలి.


## సూర్యతో నెల్సన్ మూవీకి ప్లాన్



నటుడు సూర్య 50వ చిత్రానికి 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారా? అనేది కోలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం నెల్సన్, రజనీకాంత్‌తో 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే 'సూర్య 50' కోసం వీరిద్దరూ కలిసి పని చేయనున్నట్లు సమాచారం. ఈ మైలురాయి చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీయాలని ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని, దీనికి అనిరుధ్ సంగీతం అందిస్తారని టాక్. నెల్సన్ కామెడీ స్టైల్‌కి, సూర్య ఎనర్జీ తోడైతే థియేటర్లలో నవ్వులే నవ్వులని ఫ్యాన్స్ అంచనా. నెల్సన్ ప్రస్తుతం 'జైలర్ 2' ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్నారు. దీంతో 'సూర్య 50' సెట్స్ పైకి వెళ్లేందుకు ఇంకా టైమ్ పడుతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. నెల్సన్-సూర్య కాంబో కుదిరితే తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొంటాయి.

### విశ్వంభర విడుదల తేదీపై సందిగ్ధత

## అధికారికంగా ప్రకటించని మేకర్స్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి మెగా ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను మరోసారి ఫాంటసీ ప్రపంచంలో చూడబోతున్నామని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే షూటింగ్ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఆగస్టు రిలీజ్‌పై కూడా వార్తలు వినిపించాయి. కానీ చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర'ను ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా సీజన్‌కు భారీ చిత్రాలకు మంచి మార్కెట్ ఉండటంతో ఈ పండుగను లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో భారీ చిత్రాలు క్యూ కడుతుండడం. డిసెంబర్ నుంచి వరుస స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే 2027 సంక్రాంతి, సమ్మర్ సీజన్లు కూడా ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బుక్ అయ్యాయి. దీంతో 'విశ్వంభర'కు సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం మేకర్స్‌కు సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## చీరలో ఫైట్లు చేయడం.. చాలా కష్టమైంది: సమంత

'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. "ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ఫైట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు" అన్నారు.

"నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు" అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పోనీ వర్మ తదితరులు పాల్గొన్నారు.



# మండలి చైర్మన్ కి శుభాకాంక్షలు



జనసముద్రం న్యూస్, జూన్ 16,
కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్,

ఏలూరు జిల్లా, పోలవరం నియోజకవర్గం, కొయ్యలగూడెం మండలం గవరవరం ఎంపీపీ స్కూల్లో నోట్ బుక్స్, విద్యా సామాగ్రి పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్సిపి శ్రేణులు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసినందుకు వైఎస్ఆర్సిపి శ్రేణులు మంగళవారం వేడుకలు గవరవరంలో నిర్వహించారు. పార్టీ మండల కో కన్వీనర్ బిరుదుగడ్ల ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్ (వెంకయ్య పాలెం) 100 మందికి పైగా విద్యార్థులకు పదివేల రూపాయల విలువైన నోట్ బుక్స్, విద్యా సామాగ్రిని అందజేశారు. కృషి పట్టుదలకు మెషేన్ రాజు ఆదర్శమని ఆయన అందరూ ఉన్నత చదువులు చదివి దేశ అత్యున్నత సర్వీసులలో పనిచేస్తున్నారు అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర కుమార్ ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు గంట రమేష్, కసుకుర్తి వేణు, పలేవల దుర్గారావు, వేముల సత్యనారాయణ, చిన్నం రాజు, కొండపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



నవులూరి శివారెడ్డి,
అమరావతి పార్టీ మాచర్ల,
సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

# ఆకతాయిల ఆగడాలను అరికట్టడాని కి చర్యలు తీసుకోండి : నవులూరి శివారెడ్డి

జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, రెంటచింతల మండలం, జూన్ 16;

పల్నాడు జిల్లాలోని రెంటచింతల నుండి రెంటాల గ్రామానికి వెళ్ళే మార్గంలో రైల్వేస్టేషన్ కి దగ్గరలో కొంతమంది ఆకతాయిలు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ చాలా ఇబ్బంది పెట్టడం జరుగుతుంది. ఈ వ్యవహారం పై పోలీస్ వారు తక్షణమే చర్యలు తీసుకొని ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని పోలీసు వారికి సూచించారు.

# అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్న రాయంకుల కృష్ణ



రాయంకుల కృష్ణ,
యర్రబాలెం గ్రామ టీడీపీ నాయకులు.

జనసముద్రంన్యూస్, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా, జూన్ 16;

మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు యర్రబాలెం గ్రామంలో సీసీ రోడ్లు, పొలాలకు వెళ్లేందుకు అవసరమైన గ్రావెల్ రోడ్లను నిర్మించి తనదైనశైలిలో గ్రామ అభివృద్ధి లో గ్రామ టీడీపీ నాయకులు రాయంకుల కృష్ణ ముందుకు దూసుకుపోతున్నారు. ఈవిధంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న కృష్ణ ను పలువురు యర్రబాలెం గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ఆయన గ్రామాభివృద్ధికి మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# స్వల్పంగా పెరిగిన ఒంటిమిట్ట రామయ్య హుండీ ఆదాయం



ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూన్ 16:

రెండో అయోధ్యగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం హుండీ ఆదాయం మంగళవారం లెక్కించినట్లు ఆలయ టిటిడి ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. మే 16 నుంచి జూన్ 16వ తేదీ వరకు హుండీలో భక్తులు వేసిన కానుకలు లెక్కించినట్లు ఆయన చెప్పారు. ఈ లెక్కింపులో రూ.10,76,443 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గత నెలతో పోలిస్తే ఈనెల హుండీ లెక్కింపులో స్వల్పంగా ఆదాయం పెరిగినట్లు ఆయన వివరించారు.

# కోడిగుడ్డు బుర్రకేం తెలుసు మహిళల విలువ..!

## - మాచర్ల టీడీపీ మహిళా నేతల ఆగ్రహం

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 16;



గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రాభివృద్ధికి ఐటీ కంపెనీలు తీసుకొస్తారనుకుంటే అప్పడాలు, వడియాల కుటీర పరిశ్రమలు గురించి ఆలోచించే కోడిగుడ్డు బుర్రకేం తెలుసు మహిళల విలువ అంటూ మాచర్ల టీడీపీ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సొసైటీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ..

హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పై దారుణ వ్యాఖ్యలు చేసి, మహిళల మనోభావాలు దెబ్బతీసేలా కించపరిచిన గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో మహిళలు అనేక రకాలుగా అణచివేతకు గురయ్యారని, దాదాపు 30 వేలకు పైగా మహిళల అక్రమ రవాణ జరిగిందని ఆరోపించారు. అనంతరం గుడివాడ అమర్నాథ్ చిత్రపటంపై కోడిగుడ్లు కొట్టి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరి శాంతి, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాళ్ళ అనురాధ, కండె పార్వతి, దుర్గా, ముంజుల సునీత, అశీర్వదం తదితరులు పాల్గొన్నారు.

# కనికరం లేకుండా బీసీలను ఊచకోత కోశారు..!

- గొడ్డలి పార్టీ పరాకాష్టకు నిదర్శనం అమర్నాథ్ హత్య..!!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం



జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 16;


జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై కనికరం లేకుండా ఊచకోత కు దిగారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాజోలు ఉప్పాలవారిపాలెంకు చెందిన బీసీ యువకుడు అమర్నాథ్ గౌడ్ పై వైసీపీ గుండాలు అత్యతంగా దారుణంగా దాడి చేసి, హతమార్చిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ, నివాళుర్పిస్తూ మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పార్టీ ధ్యేయం బీసీ, ఎస్టీ,ఎస్సీలను భయభ్రాంతుకుల గురి చేసి వేధించడమేనని విమర్శించారు. అక్కను ఏడిపిస్తున్న వైసీపీ మూకలను ప్రశ్నించిన అమర్నాథ్ గౌడ్ ను పెట్రోల్ పోసి, తగలబెట్టి దారుణంగా హత్య చేశారని వాపోయ్యారు. అంతేకాక వైసీపీ నేతలు ఎస్సీ యువకుడు డ్రైవర్ సుబ్రహ్మణ్యం డెడ్ బాడీ డోర్ డెలవరీ, డాక్టర్ సుధాకర్ పై దాడి, పశువైద్యులు డాక్టర్ అచ్చన్న హత్య, ఇలా లెక్కలేనన్ని శిరోముండనాలు వారి దాష్టికాలకు అద్దం పడతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉండి సొంత బాబాయ్ ను హత్య చేసిన వారిని ఎలా కాపాడుకుని, సీబీఐను తప్పుదారి పట్టించారో ప్రజలు చూశారని పేర్కొన్నారు. ఏదిఏమైనా అమర్నాథ్ మృతి ఆ కుటుంబానికి పూడ్చని లోటు అని తెలియజేస్తూ.. ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు.

# గిరిజన పిల్లలపై టికెట్ల భారం. పిట్టల ప్రదర్శన పేరుతో దోపిడీ?

## టోకూరు పంచాయతీ సీసాగూడ సమీపంలో అధిక టికెట్ ధరలపై విమర్శలు







అనంతగిరి జనసముద్రం న్యూస్ జూన్ :17

అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ సీసాగూడ గ్రామ సమీపంలో పిట్టల ప్రదర్శన పేరుతో గిరిజన పిల్లలు, పేద ప్రజల నుంచి అధిక ధరల్లో టికెట్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రకరకాల పక్షుల పేర్లు చెబుతూ చిన్నారులను ఆకర్షించి, వాటిని చూడాలంటే భారీ మొత్తంలో టికెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో నివసిస్తూ, అక్కడి ప్రజల ఆధారంగానే వ్యాపారం నిర్వహిస్తున్న కొందరు నిర్వాహకులు అదే గిరిజనులపై ఆర్థిక భారం మోపడం సరికాదని పలువురు

అభిప్రాయపడుతున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవించే కుటుంబాలు పిల్లల కోరిక మేరకు టికెట్లు కొనుగోలు చేయాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, టికెట్ ధరలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో వినోదం, ప్రదర్శనల పేరుతో ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేసే చర్యలు జరిగితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

"గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తే సహించేది లేదు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలి" అని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# అమర్నాథ్ హత్య అత్యంత కిరాతకం..!

## శ్రద్ధాంజలి ఘటించిన కూటమి పార్టీ బీసీ నాయకులు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 16;

బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాజోలు ఉప్పాలవారిపాలెంకు చెందిన బీసీ యువకుడు అమర్నాథ్ గౌడ్ ను వైసిపి గుండాలు అత్యంత కిరాతంగా హత్య చేయడం, బాధకరమని పట్టణ టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు అవేదన వ్యక్తం చేశారు.

మంగళవారం సోసైటీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో దివంగత అమర్నాథ్ గౌడ్ 3వ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కూటమి పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



జగన్ పాలనలో బీసీలను ఊచకోత కోశారని దుయ్యపట్టారు. దాదాపు 30 వేల మంది బీసీలను వైసీపీ వేధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల బీసీ నాయకులు



కొమర లాల్ కృష్ణ, కొమెర అనంతరాములు, శాంతి, పచ్చిపాళ్ళ అనురాధ, దుర్గా, బత్తుల కుమార్, చందు గౌడ్, రంగయ్య, శివ,బత్తిన రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ గౌడ్ ఘటనకు మూడేళ్లు

## బాధిత కుటుంబానికి న్యాయం కోరుతూ కారంపూడి పట్టణ గౌడ సామాజిక వర్గం డిమాండ్



జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా,
కారంపూడి, జూన్ 16;

రేపల్లె నియోజకవర్గానికి చెందిన అమర్నాథ్ గౌడ్ హత్య ఘటన జరిగి మూడేళ్లు పూర్తైన సందర్భంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కారంపూడి పట్టణంలోని పలువురు నాయకులు,



ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్‌పై పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా అప్పట్లో సంచలనం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యులు నిందితులకు కఠిన శిక్షలు విధించాలని కోరుతున్నారు. ఈ కేసులో నిందితులు బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా బాధిత కుటుంబానికి బెదిరింపులు ఎదురయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఘటనను ప్రస్తావిస్తూ పలువురు రాజకీయ నాయకులు గత పాలనలో శాంతిభద్రతల పరిస్థితిపై విమర్శలు గుప్పించారు. మరోవైపు, ప్రస్తుత ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసి, నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అమర్నాథ్ గౌడ్ ఘటన వంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు అవసరమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేసు పురోగతి, న్యాయ ప్రక్రియపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

ఏరువ శ్రీనివాస్ గౌడ్, గుండ్ల బాదరయ్య గౌడ్, ఉప్పలపాటి మురళి గౌడ్, ఏరువా హరికిష్ణ గౌడ్, బెల్లంకొండ శ్రీను గౌడ్, బెల్లంకొండ గోపి గౌడ్, సునీల్, విజయ్, షావుకారు జానీ, పాలెపోగు బాబు, సొంటి గోవింద్ గౌడ్, గాలి వాసు గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ షఫీ నాయక్ జన్మదిన వేడుకలు

లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూన్ 16

లక్కిరెడ్డిపల్లి టౌన్ నందు మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ ఎం డి సేపినాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు షఫీ నాయక్ అభిమానులు విరివిగా పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాణాసంచా పేలుస్తూ ఆయనకు దండలు వేసి బుకెలు ఇచ్చి, శాలువాలు కప్పి, భారీ కేక్ కటింగ్ చేసి సంబరాలు చేశారు తెలుగుదేశం నాయకులు రాజకీయంగా ఇంకా ఉన్నత స్థానాలు

అధిరోహించాలని అష్టైశ్వర్యాలతో, ఆరోగ్యంగా నిండు నూరేళ్లు ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని చైర్మన్ కు పుట్టినరోజు సందర్భంగా శు



భాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ స్టోర్ రవి గోవిందు శ్రీకాంత్, కావలి ఆంజనేయులు, తెలుగు యువత అధ్యక్షుడు, బోనాల ధన, గంటా వెంకటకృష్ణ,



వీరభద్ర నాయుడు, మల్లీ నాయుడు, మహమ్మద్, ఖలీల్, పెయింట్ భాస్కర్, పాలెం తెలుగుదేశం నాయకులు, షఫీ నాయక్ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

# తాసిల్దార్ ఆఫీస్ లో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం



జనసముద్రం న్యూస్ అమడుగురు 16/06/2026

అమడగూరు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో మండల తాసిల్దార్ మారుతి ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ ఆధ్వర్యంలో మండల బిఎల్ఓ లకు ఓటర్ జాబితా సవరణపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది .

ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మారుతీ ప్రకాష్ మాట్లాడుతూ 2002 ఓటర్ జాబితా ప్రకారం 30 40 నుంచి సంవత్సరాలలోపు నమోదైన ఓటర్ జాబితా ప్రకారం మహిళలకు గాని పురుషులు గాని వారి జాబితా ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ నమోదు అడ్రస్ ప్రకారం మహిళ అయితే ఎక్కడ నుంచి వివాహం జరిగినదో అక్కడ ఓటర్ జాబితా ఐడీ ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ ఐడి ప్రకారం 2002లో నమోదైన పేరును అప్లికేషన్లు దరఖాస్తు చేసుకుని ఉన్న లిస్టు ప్రకారం 2026 సంవత్సరాలకి ఓటు నమోదు చేసుకోవాలని బి ఎల్ఓ లు మీ ఇంటి దగ్గరికి వస్తారని అప్లికేషన్ ఇచ్చి ఓటర్ జాబితాను ప్రారంభిస్తారు వారికి సహకరించి ఎటువంటి అవకతవకలు లేకుండా ఓటు నమోదు చేసుకొని రెండు పాస్ ఫోటోలు అప్లికేషన్ ఫారం లో పేరు నమోదు చేసి ఇవ్వాలని తాసిల్దార్ మారుతీ ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ సూపర్వైజర్లు 26 మంది బిఎల్వోలు కంప్యూటర్ ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం




**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,జూన్ 16**

విజయపురి సౌత్ నందుగల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులను ఆహ్వానించటమైనది. ఇంగ్లీష్ 02, గణిత శాస్త్రం 01, ఫిజిక్స్ 01 కెమిస్ట్రీ 01 హిస్టరీ 01, పొలిటికల్ సైన్స్ 01, కామర్స్ 05, కంప్యూటర్ సైన్స్ 02, లైబ్రేరియన్ 01, ఫిజికల్ డైరెక్టర్ 01, స్టాటిస్టిక్స్ 01 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జి .వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎస్ ఈ టి , ఎన్ ఈ టి పీహెచ్డీ , ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును అని తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ నందు పీజీలో 55% తప్పనిసరిగా ఉండవలెనని తెలిపారు. అర్హత కలవారు 22.06.2026 న ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో కళాశాల యందు ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించవలసిన నెంబర్లు 9963223164.7989557046 .

# నేత్రపర్వంగా శివ కళ్యాణం



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 16 ద్వారకా తిరుమల.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శివదేవుని కళ్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది.ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయ ముఖా మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతి సమేత శివయ్య కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు పుష్పలంకారాలు చేశారు. శుభ ముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపారు.

# వాసవి సేవాదళ్ రాష్ట్ర డైరెక్టర్ గా నియామకం



**కుందుర్పి జూన్, 16 జనసముద్రం, న్యూస్ :**

ఆర్యవైశ్య లెజెండ్ మాజీ మంత్రివర్యులు గౌరవనీయులు టీజీ వెంకటేష్ ఆశీస్సులతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య సూచనలతో రాష్ట్ర వాసవి సేవాదళ్ అధ్యక్షులు శ్రీ దూపకుంట్ల శబరి వరప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వాసవి సేవాదళ్ డైరెక్టర్ గా గోవిందరాజులు ని నియమించడం జరిగింది...

మీకు అప్పజెప్పిన బాధ్యతలను శ్రీ వాసవి మాత దీవెనలుగా భావించి ఆర్యవైశ్యుల ఉన్నతకి పాటుపడాలని కోరుకుంటున్నాము.త ద్వారా రాష్ట్ర వాసవి సేవాదళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అతులూరి కృష్ణ కిరణ్ రాష్ట్ర వాసవి సేవాదళ్ ప్రధాన కార్యదర్శి గాజులపల్లి అభినయ్ రాష్ట్ర వాసవి సేవాదళ్ కోశాధికారి కొల్లూరు లక్ష్మణ్ గుప్త రాష్ట్ర వాసవి సేవాదళ్ వర్కింగ్ సెక్రటరీ గుండా శ్రీకాంత్ పదవి రావడానికి వీరందరూ సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి అందరం కృషిచేద్దాం

## - డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూన్ 16:**

పర్యాటక రంగ అభివృద్ధికి అందరం కృషిచేద్దామని ఒంటిమిట్ట మండల విద్యా శాఖాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం ఆయన ఒంటిమిట్ట కోదండ రామాలయం సందర్శించినపుడు అక్కడి యాత్రికులు ఆలయ ప్రాంగణంలో శిల్ప కళను ఆసక్తిగా గమనించడం చూసి వారికి ఆలయ ప్రాశస్త్యం గురించి , శిల్పకళా వైభవం గురించి తెలియజేశారు. తూర్పు ముఖ ద్వారం అధిష్టానం మీద ఉన్న వృషభ కుంజరం మరియు సీతారామ కళ్యాణం లాంటి ప్రసిద్ధి చెందిన శిల్పాల గురించి పర్యాటకులకు చక్కగా వివరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల ఆసక్తిని గమనించి వారికి ఆలయం మరియు ఆలయ శిల్పకళా విశిష్టతను వివరించారు. ప్రతి స్థానికులు ఇలా అవకాశం వచ్చినపుడు ఆయా ప్రాంతాలకు వచ్చే భక్తులకు, పర్యాటకులకు మన ప్రాంతం విశిష్టతను తెలియజేసేవిధంగా ఉండాలని, తద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి , ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కృషిచేసినట్లు అని అన్నారు. అనంతరం కోదండ రామస్వామిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైవియు లలిత కళల విభాగాధిపతి ఆచార్య కోట మృత్యుంజయ రావు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, పర్యాటక ఫోటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కొమెర అనంతరాములు కి బెర్త్ డే విషెస్ తెలిపిన నవులూరి శివారెడ్డి





**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 16;**

మాచర్ల శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కొమెర అనంతరాములు కి అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి బర్త్ డే విషెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# ఇంటి ముంగిళ్లకే పొడి చెత్తకు నిత్యవసరాలు.



**జన సముద్రం న్యూస్ గుడివాడ నియోజవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం.జూన్.16.**

ఇంటి ముంగిళ్లకే స్వచ్ఛ రథంలో పొడి చెత్తకు నిత్యవసర సరుకుల్ని పంపిణీ చేస్తున్నట్లు పెంజెంద్ర గ్రామ కార్యదర్శి పామర్తి దుర్గా నాగ మల్లేశ్వరరావు తెలిపారు. గ్రామంలో స్వచ్ఛ రృథానికి పొడి చెత్తను అందించిన స్థానికులు అందుకు బదులుగా నిత్యవసరాలను తీసుకున్నారు. ప్లాస్టిక్, ఓల్డ్ బుక్స్, స్టీల్, కార్డ్ బోర్డు, అల్యూమినియం, ఐరన్, పేపర్ వంటివి స్వచ్ఛ రథానికి అందజేసి దానికి బదులుగా పప్పు, ఉప్పు, కారం, సబ్బు లాంటి కిరాణా వస్తువులు పొందవచ్చునని నరసింహారావు చెప్పారు. ఇది స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అందరూ సహకరించి మన ఊరిని శుభ్రంగా, పచ్చగా ఉంచాలని ఆయన కోరారు.

# ఇంటింటికీ సర్..





**జనసముద్రం న్యూస్ గుడివాడ**
**నియోజకవర్గ ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్.16.**

మండలంలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అత్యంత కీలకమైన ఇంటింటి సర్వే మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. మండలంలో 57పోలింగ్ కేంద్రాల్లో 57మంది బీఎల్వోలు సర్ సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

ఈ ప్రక్రియ జూలై 14 వరకూ నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు(బీఎల్వే) ఇంటింటికీ వెళ్తారు. ప్రతి ఓటరుకూ రెండు ఎన్యుమరేషన్ ఫాంలు ఇస్తారు. వాటిలో ఓటరు పేరు, ఫొటో గుర్తింపు కార్డు నెంబరు, చిరునామా వివరాలతో పాటు ఓటరు పాత ఫొటో ముద్రించి ఉంటాయి. మిగతా వివరాలను ఓటరు నింపాలి. అందుకు బీఎల్వోలు సహకరిస్తారు. పూర్తి చేసిన ఫాంలను బీఎల్వోలే వచ్చి తీసుకుంటారు. ఈ నెల రోజుల్లో ఎన్యుమరేషన్ ఫాంలు ఇవ్వడానికి, నింపినవాటిని తిరిగి తీసుకోవడానికి మూడుసార్లు బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్తారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. ఈ ప్రక్రియపై బీఎల్వోలకు ఈసీ ఇప్పటికే శిక్షణిచ్చింది. సర్ విషయాలపై తహసీల్దార్ బి.లోకరాజు ఇస్తున్న వివరాలు ఇలా ఉన్నాయి.

- 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ప్రస్తుత జాబితాను పరిశీలించి మ్యాపింగ్ చేస్తున్నారు.
- ఓటర్ల జాబితాలో పేరున్నవారు ఎన్యుమరేషన్ ఫాంతో పాటు, 2002 నాటి జాబితాలో వారి లేదా కుటుంబీకుల వివరాలు పొందుపరిచి ఇస్తే చాలు. ఇతర పత్రాలేవీ అక్కర్లేదు.
- రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎన్ఏ) ఒక్కొక్కరు గరిష్ఠంగా 50 ధ్రువీకరించిన ఫాంలను బీఎల్వోలకు సమర్పించవచ్చు.
- 2002 నాటి జాబితాలో మీ పేరుంటే ఆ వివరాలు ఎన్యుమరేషన్ ఫాంలో నింపాలి.
- అప్పటి జాబితాలో మీ పేరు లేకపోతే.. మీ తల్లిదండ్రులు లేదా భార్య, భర్త లేదా ఇతరత్రా కుటుంబికులు, సంబంధికుల పేర్లు ఎవరివి ఉంటే వారి వివరాలు నమోదు చేయాలి.
- వీటితో పాటు పుట్టిన తేదీ, ఆధార్, మొబైల్ నంబరు, తండ్రి, సంరక్షకుడి పేరు, తల్లి పేరు, భార్య లేదా భర్త పేరు, వారి ఎపిక్ నంబరు (అందుబాటులో ఉంటే) వివరాలు నింపి, కొత్త కలర్ ఫొటోలు అతికించి బీఎల్వోలకు ఇవ్వాలి.
- రెండు ఫాంలలో ఒకదానిపై బీఎల్వో సంతకం చేసి దాన్నే రసీదుగా ఓటరుకు ఇస్తారు. దీన్ని భద్రపరుచుకోవాలి.
- జులై 14లోగా తిరిగివ్వాలి. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంలను ఓటర్లు జులై 14లోగా తిరిగి బీఎల్వేలకు సమర్పించాలి.
- ఈ ఫాంలు వెనక్కి ఇవ్వనివారి పేర్లు జులై 21న విడుదలయ్యే ముసాయిదా జాబితాలో ఉండవు.
- బీఎల్వో ఫారాలు వెనక్కి ఇవ్వని ఓటర్లపై బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు.
- తెలుసుకున్న కారణాలను పోలింగ్ కేంద్రంలోని నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తారు.
- సరైన విచారణ చేపట్టకుండా, నోటీసు ఇచ్చి మాట్లాడే అవకాశం కల్పించకుండా జాబితా నుంచి ఎవరి ఓట్లూ తొలగించరు.
- ఈఆర్వో నిర్ణయంపై అభ్యంతరముంటే 15రోజుల్లోగా జిల్లా మేజిస్ట్రేట్ 30రోజుల్లోగా సీఈఓకు అప్పీలు చేసుకోవచ్చు.
- 2002 నాటి, ప్రస్తుత ఓటర్ల జాబితాలు పోలింగ్ కేంద్రాల వారీగా 'సీఈవో ఆంధ్ర' వెబ్సైట్లో ఉంటాయి.
- బీఎల్వోల వద్ద, రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల వద్ద కూడా లభిస్తాయి.
- ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటరు ఎన్యుమరేషన్ ఫాంను ఆ ఇంటి పెద్ద లేదా ఇతర కుటుంబ సభ్యులకు అందజేస్తారు. వారే ఆ ఓటరు వివరాలు నింపి, వారి తరపున సంతకం చేసి బీఎల్వోకు ఇవ్వాలి.
- ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.
- ఆ రోజు నుంచి ఆగస్టు 20 వరకూ క్లెయిములు, అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవచ్చు.
- కొత్తగా ఓటరుగా చేరాలంటే ఫాం-6లో, చిరునామా మార్పునకు ఫాం-8లో, మతులు, అనర్హుల పేర్లు తొలగింపునకు ఫాం-7లో దరఖాస్తు చేసుకోవాలి.
- సెప్టెంబరు 18 వరకూ వాటిని పరిశీలించి, అర్హతలు ఉంటే తుది జాబితాలో పేరు చేరుస్తారు.
- అనర్హులుగా తేలితే తొలగిస్తారు. సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారని తహసీల్దార్ లోకరాజు పేర్కొన్నారు.

# నెల్లూరులో ఘనంగా ఎన్డీఏ ప్రజా ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు.

## అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత: మద్దిపాటి వెంకటరాజు.





**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా**
**జూన్ 16 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ఎన్డీఏ కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, నెల్లూరులో ఏర్పాటు చేసిన 'విజయోత్సవ కార్యక్రమం' మంగళవారంఘనంగాజరిగింది. ఒంగోలు-నెల్లూరు జోనల్ కో-ఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా హాజరై, కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ.. గత రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రం పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ఏమాత్రం వెనకడుగు వేయకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ, ప్రతి లబ్ధిదారుడికి చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను పరిశీలించి, ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి అనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు, పాశం సునీల్ కుమార్ గూడూరు, శ్రీకావ్య కృష్ణారెడ్డి కావలి, కాకర్ల సురేష్ ఉదయగిరి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్వేపల్లి మేయర్ దేవరకొండ సుజాత, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# రాష్ట్ర హోం మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు...

## గుడివాడ అమర్‌నాథ్‌పై ఏపూరి దాలయ్య తీవ్ర ఆగ్రహం.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా**
**జూన్ 16 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను రాజమండ్రి పార్లమెంటు అధికార ప్రతినిధి ఏపూరి దాలయ్య తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో అమర్‌నాథ్ తీరుపై ధ్వజమెత్తారు.ఒక మాజీ మంత్రిగా ఉండి, హోం మంత్రి పదవిలో ఉన్న మహిళను ఉద్దేశించి సభ్య సమాజం తలదించుకునే విధంగా మాట్లాడటం గుడివాడ అమర్‌నాథ్ అహంకారానికి, దిగజారుడుతనానికి నిదర్శనమని ఏపూరి దాలయ్య విమర్శించారు. ఇటువంటి భాష మీ పార్టీకి, మీ నాయకులకు మాత్రమే చెందుతుందని ఆయన ఎద్దేవా చేశారు.

"నీ కుటుంబంలో కూడా ఆడపిల్లలు ఉన్నారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తిగా, కనీస సంస్కారం లేకుండా ఒళ్లు కొవ్వెక్కి మాట్లాడటంమానుకో"అని దాలయ్య హెచ్చరించారు. మహిళల పట్ల ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం ద్వారా మీరు యావత్ మహిళా సమాజాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు.

మరొక్కమారు మా ఇంటి ఆడబిడ్డ, ఈ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై గాని, ఏ మహిళపై గాని అనుచిత వ్యాఖ్యలు చేసినా చూస్తూ ఊరుకునేది లేదని దాలయ్య హెచ్చరించారు. అటువంటి పక్షంలో చట్టపరమైన చర్యలతో పాటు, యావత్ దళిత సమాజం మీకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏపూరి దాలయ్య ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.



రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



రాజమండ్రి పార్లమెంటు అధికార ప్రతినిధి ఏపూరి దాలయ్య.

# తాసిల్దార్ ఆఫీస్ లో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం



జనసముద్రం న్యూస్ 16 /6/2026

ఆమడగూరు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో మండల తాసిల్దార్ మారుతి ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ ఆధ్వర్యంలో మండల బిఎల్ఓ లకు ఓటర్ జాబితా సవరణపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మారుతీ ప్రకాష్ మాట్లాడుతూ 2002 ఓటర్ జాబితా ప్రకారం 30 40 నుంచి సంవత్సరాలలోపు నమోదైన ఓటర్ జాబితా ప్రకారం మహిళలకు గాని పురుషులు గాని వారి జాబితా ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ నమోదు అడ్రస్ ప్రకారం మహిళ అయితే ఎక్కడ నుంచి వివాహం జరిగినదో అక్కడ ఓటర్ జాబితా ఐడీ ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ ఐడి ప్రకారం 2002లో నమోదైన పేరును అప్లికేషన్లు దరఖాస్తు చేసుకుని ఉన్న లిస్టు ప్రకారం 2026 సంవత్సరాలకి ఓటు నమోదు చేసుకోవాలని బి ఎల్ఓ లు మీ ఇంటి దగ్గరికి వస్తారని అప్లికేషన్ ఇచ్చి ఓటర్ జాబితాను ప్రారంభిస్తారు వారికి సహకరించి ఎటువంటి అవకతవకలు లేకుండా ఓటు నమోదు చేసుకొని రెండు పాస్ ఫోటోలు అప్లికేషన్ ఫారం లో పేరు నమోదు చేసి ఇవ్వాలని తాసిల్దార్ మారుతీ ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ సూపర్వైజర్లు 26 మంది బిఎల్వోలు కంప్యూటర్ ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారుతాసిల్దార్ ఆఫీస్ లో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం

# హోం మంత్రి అనిత పై ,గుడివాడ బుద్ధి లేని మాటలు ప్రజల హర్షించరు.

## రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య



ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్ 16:


వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పై మాట్లాడిన బుద్ధిలేని మాటలను రాష్ట్ర ప్రజలు హర్షించరని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య విమర్శించారు.

ఒంటిమిట్టలో మంగళవారం విలేకరులతో కొమరా మాట్లాడుతూ, వైఎస్ఆర్సిపి పార్టీ ని రాష్ట్ర ప్రజలు రాజకీయాలకు అనర్హులని చీకొట్టి 11 సీట్లతో మూలన కూర్చోబెట్టిన ఆ పార్టీలో ఉన్న గుడివాడ అమర్నాథ్ లాంటి బుద్ధిలేని వారికి ఇంకా జ్ఞానోదయం కలగలేదని అన్నారు. సభ్య సమాజం చీకొట్టేలా దళిత సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర హోం మంత్రి శ అనిత వస్త్రధారణ డ్రస్ కోడ్ గురించి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యల పైన ముఖ్యంగా రాష్ట్రంలో మహిళల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవు తోందని అన్నారు. గుడివాడ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని భార్య, అక్క చెల్లెలు కూడా ఉండి ఉంటారని, వారి పైన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఈపాటికి వైయస్సార్ పార్టీ రోడ్లెక్కి నానా హంగామా చేసి ఉండేది అన్నారు .

ఆ విషయం గుర్తు ఉంటే ఇలాంటి బుద్ధిలేని వ్యాఖ్యలు హోంమంత్రిపైచేసి ఉండరని ఆయన విమర్శించారు. ఈ రాష్ట్రంలో విమర్శించేందుకు ఎలాంటి సమస్య లేకుండా పోవడంతో సహనం కోల్పోయిన వైఎస్సార్ పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలతో రోడ్లు ఎక్కిఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు మరికొందరు బుద్ధిలేని అమర్నాథ్ లాంటి వారు మహిళ అనికూడా చూడకుండా నేడు హోం మంత్రి అనితపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అయిన విషయమని కొమరా అన్నారు. కనీ స ఇంగిత జ్ఞానం లేని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్బేషరత్ గాహోంమంత్రి అనితకుబహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఇప్పటికే తగిన విధంగా బుద్ధి చెప్పిన గుడివాడ లాంటి వారికి మరో మారు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని, వైయస్సార్ పార్టీ మరో మారు బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని కొమరా వెంకట నరసయ్య జోష్యం చెప్పారు.

# వ్యాపారం గా మారిన విద్య..

- నరసాపురం పరిధిలో నలిగిపోతున్న మధ్యతరగతి సామాన్యుడు
- యూనిఫం సైతం మా దగ్గర కొనాలని వత్తిడి
- విద్యాశాఖ అధికారులు తనికీలు నిర్వహించాలని విద్యార్థి తల్లిదండ్రులు వేడుకోలు




నరసాపురం జూన్ 16 జనసముద్రం
పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్

ఒకప్పుడు గోదావరి తీరాన సంస్కృతికి, సేవాభావంతో కూడిన విద్యకు నిలయమైన నరసాపురం ప్రాంతంలో నేడు విద్యా వ్యవస్థ క్రమంగా పక్కా వ్యాపార వస్తువుగా మారిపోతోంది. నేటి సమాజంలో "కూడు, గూడు, గుడ్డ" ఎంత అవసరమో, పిల్లలకు నాణ్యమైన చదువు అందించడం కూడా అంతే అనివార్యమైంది. అయితే, నరసాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోని ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ మరియు ఉన్నత విద్యా సంస్థల వరకు ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు పెంచుకుంటూ పోతున్న ఫీజుల భారం స్థానికంగా ఒక పెద్ద సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఉచిత వసతులు, ల్యాబ్‌లు ఉన్నప్పటికీ, మారుతున్న కాలంతో పాటు ఇంగ్లీష్ మీడియం చదువుల వైపు వెళ్లాలనే తపన, సమాజంలో ఉండే స్టేటస్ సింబల్ భ్రమల వల్ల ప్రజలు ప్రైవేట్ సంస్థల వైపు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు ఎల్‌కేజీ సీటు నుంచే వేలాది రూపాయల ఫీజులను గుంజుతున్నాయి. కేవలం ట్యూషన్ ఫీజులకే పరిమితం కాకుండా పుస్తకాలు, యూనిఫారాలు, స్కూల్ వ్యాన్లు, ప్రత్యేక తరగతుల పేరిట అదనపు బాదుడు

బాదుతున్నాయి. ఇక ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయికి వచ్చేసరికి ఐఐటీ, నీట్ వంటి కోచింగ్‌ల పేరిట "ర్యాంకుల వేట – ఫీజుల కోట" నడుస్తోంది. ల్యాబ్ ఫీజులు, లైబ్రరీ ఫీజులు, ఎగ్జామ్ ఫీజుల పేరుతో విద్యార్థుల రక్తాన్ని జూరుతున్న పరిస్థితి మన నరసాపురం నియోజకవర్గ పరిధిలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ విద్యా వ్యాపారీకరణ వల్ల నరసాపురం పరిధిలో అందరికంటే ఎక్కువగా నలిగిపోతున్నది మధ్యతరగతి కుటుంబాలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అటు పూర్తి పేదవారిలా ప్రభుత్వ పథకాలు లేదా పూర్తి ఉచిత సదుపాయాలను క్లెయిమ్ చేసుకోలేక, ఇటు ధనవంతుల్లా లక్షల రూపాయల ఫీజులను అలవోకగా కట్టలేక మధ్యతరగతి తల్లిదండ్రులు పడుతున్న ఆగట్లు, పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మన ప్రాంతంలో వ్యవసాయం, చిన్నపాటి వ్యాపారాలు, ప్రైవేట్ ఉద్యోగాలపై ఆధారపడే మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆరాటంతో వీరు తమకున్న కొద్దిపాటి ఆస్తులను, పొలాలను అమ్ముకోవడమో లేదా బ్యాంకుల్లో, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర భారీగా అప్పులు చేయడమో జరుగుతోంది. జీవితాంతం సంపాదించిన సంపాదన అంతా పిల్లల ఫీజులకే సరిపోతుండటంతో, వడ్డీలు కట్టలేక మానసిక ఒత్తిడికి గురవుతూ ఎన్నో కుటుంబాలు లోలోపల నలిగిపోతున్నాయి. తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాన్ని, తాము కడుతున్న ఫీజులను చూసి విద్యార్థులు కూడా తీవ్రమైన మానసిక ఆందోళనకు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు. మార్కులు తక్కువ వస్తే ఏమైపోతుందోననే భయంతో కొందరు బలవన్మరణాలకు కూడా పాల్పడుతున్నారు.

అయితే, ఈ సుడిగుండంలో కూడా నరసాపురం పరిసర ప్రాంతాల్లోని కొన్ని విద్యా సంస్థలు మానవీయ కోణాన్ని ప్రదర్శిస్తూ ఆశాదీపాలుగా నిలుస్తున్నాయి. వ్యాపారమే పరమావధిగా కాకుండా, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తున్న కొన్ని స్థానిక యాజమాన్యాలు, విద్యా సంస్థలు కూడా మన మధ్య ఉన్నాయి. ఇటువంటి సంస్థలు మధ్యతరగతి, పేద కుటుంబాల స్థితిగతులను అర్థం చేసుకుని ఫీజుల విషయంలో పెద్ద ఎత్తున రాయితీలు (కన్సెషన్లు) ప్రకటిస్తున్నాయి. ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన నరసాపురం గ్రామీణ ప్రాంత విద్యార్థులను గుర్తించి, వారికి ఉచితంగా లేదా నామమాత్రపు ఫీజులతోనే ఇంటర్, డిగ్రీ చదువులను అందిస్తున్నాయి. మరికొన్ని సంస్థలు తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులను గమనించి, ఫీజులను ఒకేసారి కాకుండా సులభ వాయిదాల పద్ధతిలో (ఇన్‌స్టాల్‌మెంట్స్) కట్టుకునే వెసులుబాటును కల్పిస్తూ అండగా నిలుస్తున్నాయి. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల తర్వాత దెబ్బతిన్న స్థానిక కుటుంబాలను ఆదుకునేందుకు ఫీజులను తగ్గించి కట్టించుకున్న విద్యా సంస్థల ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇటువంటి మానవతా దృక్పథం కలిగిన సంస్థల వల్లే నేటికీ నరసాపురంలోని ఎంతో మంది పేద, మధ్యతరగతి మెరిట్ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతున్నారుచివరగా, అక్షరాన్ని అంగడి సరుకుగా మార్చే కార్పొరేట్ దోపిడీ శక్తులపై ప్రభుత్వం కఠినమైన ఫీజు నియంత్రణ చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే, నరసాపురం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలలో మౌలిక వసతులను, నాణ్యతను మరింత పెంచి ప్రైవేటుకు దీటుగా బలోపేతం చేయాలి. లాభార్జనే ధ్యేయంగా కాకుండా, మానవత్వంతో రాయితీలు ఇస్తూ విద్యార్థులను ఆదుకుంటున్న విద్యా సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. అప్పుడే నరసాపురంలోని మధ్యతరగతి కుటుంబాల ఆగట్లు తప్పుతాయి, విద్య అనేది ప్రతి ఒక్క సామాన్యుడికి అందుబాటులోకి వచ్చి మన ప్రాంతం నిజమైన ప్రగతి సాధిస్తుంది.

# పేరుపాలెంలో మదనగోపాలస్వామి ఆలయ మెరక భూమి వేలం పాట వాయిదా

మొగల్తూరు, జూన్ 15 జనసముద్రం
పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెంగ్రామంలోవెలసి ఉన్నశ్రీ మదనగోపాలస్వామి ఆలయానికి చెందిన సంపూర్ణ హక్కు భక్తమొలలో గల మెరక భూమి వేలం పాట సోమవారం జూన్ 15, 2026సాయంత్రం 3 గంటలకు నిర్వహించారు.

ఈ వేలం పాటకు గ్రామస్తులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుతం వర్షాధార పరిస్థితులు నెలకొన్నందున వ్యవసాయ దిగుబడులు అనిశ్చితంగా ఉన్న నేపథ్యంలో, కౌలు కాలాన్ని ఒక సంవత్సరానికి కాకుండా ఐదు సంవత్సరాలకు నిర్ణయించాలని గ్రామస్తులు కోరారు. దీని ద్వారా రైతులకు స్థిరత్వం ఏర్పడి సాగు అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

గ్రామస్తులు మరియు రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఆలయ అధికారులు, పెద్దల సమక్షంలో వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. గ్రామస్తుల కోరిక మేరకు భవిష్యత్తులో ఐదు సంవత్సరాల కౌలు కాలపరిమితితో పాట నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఈఓ రామకృష్ణంరాజు మరియు డా. ఆర్.వి.వి.ఎస్. రామచంద్ర కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. మరో పది రోజుల వ్యవధి అనంతరం తిరిగి వేలం పాట నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

గ్రామ ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నటీడీపీ నాయకులు





లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ : జూన్ 16

మండలంలోని కుర్నుతల అగ్రహారం సచివాలయం మరియు మద్దిరేవుల గ్రామంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ఓటర్ వెరిఫికేషన్ (ఎస్ ఐ ర్) కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ముదిరాజ్ అధికార కమిటీ సభ్యులు మండ్ల రామాంజనేయులు పాల్గొన్నారు. అలాగే మద్దిరేవుల నెహ్రూ నగర్ నందు టిడిపి నాయకులు కావలి ఆంజనేయులు సుంకర వెంకటరమణ పాల్గొన్నారు

**ఈ సందర్భంగా మశీడ్ల రామాంజనేయులు మాట్లాడుతూ..**

సమాజంలో ఓటు హక్కు చాలా విలువైందని ప్రతి ఒక్కరూ ఆ విలువను తెలుసుకుని ఓటు నమోదును ఓటు నమోదు పత్రాలు పూర్తిగా సంబంధిత పత్రాలలో నింపి బి యల్ ఓ కు ఇచ్చి మ్యాపింగ్ అయ్యేవిధంగా ప్రతి ఒక్కఓటరు చూసుకోవాలని ఆయన తెలియజేశారు. ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి ఎన్ని కల కమిషన్ మరియు ప్రభుత్వాలు ఎస్ ఐ ర్ కార్యక్రమశీ చేస్తాదని దీనివలన తప్పుడు ఓట్ల తొలగి సరైన ఓటర్ జాబితా వచ్చేందుకు వీలు ఉంటుందని ఆయన తెలిపారు. సమాజంలోని ప్రతి ఓటరు మరియు ప్రజలు యుద్ధ ప్రాతిపదకన ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహాయసహకారాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఓటర్ వెరిఫికేషన్ లో పాల్గొన్న లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ యస్ యం డి షఫీ నాయక్



లక్కిరెడ్డిపల్లి : జనసముద్రం న్యూస్ జూన్ 16

లక్కిరెడ్డి పల్లె టౌన్ నందు బి ఎల్ ఒ ల తో కలసి ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ వెరిఫికేషన్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు రాయచోటి టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదేశం మేరకు పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ యస్ యం డి షఫీ నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రమణ బిఎల్వోలు ఆయనతో కలిసి ఉన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫి నాయక్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ప్రతి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఓటు ఉన్నదా లేదా సరిచూసుకోవాలని ప్రజలను కోరారు. రానున్న స్థానిక ఎన్నికలలో అర్హులైన ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పై సమాచారం అందించి నమోదు చేయించాలన్నారు .

# నేడు లక్కిరెడ్డిపల్లి మండల సర్వసభ్య సమావేశంలి.

లక్కిరెడ్డిపల్లి : జనసముద్రం న్యూస్ జూన్ 16

లక్కిరెడ్డిపల్లి మండల సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సభాభవనం నందు జరుగుతుందని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశ అజెండాలో వైద్య ఆరోగ్యశాఖ, త్రాగునీరు, పారిశుధ్యము, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ ,ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం ,విద్యాశాఖ, ఇరిగేషన్ శాఖ ,అటవీ శాఖ, విద్యుత్ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఖాది ,గ్రామీణ పరిశ్రమలశాఖ,శ్రీ శిశు సంక్షేమ శాఖ ,పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ ,స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు శాఖ, మహిళా సమైక్య, వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాల పైన సమీక్ష ఉంటుందని తెలిపారు.

ఈ సమావేశానికి ఎంపీటీసీలు పంచాయతీ స్పెషల్ అధికారులు హాజరవడం జరుగుతుందని, మండల శాఖ అధికారులు కచ్చితంగా హాజరుకావాలని క్రింది స్థాయి అధికారులు పంపకూడదని తెలిపారు.

ఈ సమావేశ అజెండా పత్రాలను జిల్లా స్థాయి ,రాయచోటి నియోజకవర్గస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులకు కూడా పంపడం జరిగిందని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు.

# మాతృశ్రీ వృధాశ్రమం హక్కునచేర్చుకున్న మాధవి



అమడగురు జనసముద్రం న్యూస్ 16/06/2026

అమడగూరు మండలంలో గాజులపల్లి దగ్గర వెలసిన మాతృశ్రీ రథ ఆశ్రమం వెలసి ఉన్నది ఈ ఆశ్రమంలో ఎంతోమంది అవ్వ తాతలను దగ్గర చేర్చుకొని వృధా ఆశ్రమం నడిపిస్తున్న అరుణ్ జ్యోతి ఎంతో సేవాభావంతో తన కుటుంబమే అవ్వా తాతల కుటుంబమని తన జీవనాధారమే తన కుటుంబ భవిష్యత్తు అవ్వ తాతల్లో చూసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఆశ్రమాన్ని భగవంతుని ఆశీస్సులతో ముందుకు నడిపిస్తుంది అలాంటి ఆశ్రమంలో పుట్టపర్తి జిల్లా కాకుండా ఇతర జిల్లా వాసులు కూడా అరుణ్ జ్యోతి ఆశ్రమంలో దీనస్థితిలో ఉన్న మాధవి ను హక్కున చేర్చుకున్న శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమం కదిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు గత వారం రోజులుగా ఎటువంటి ఆధారం లేని మాధవి అనే మహిళ మానసికంగా దీనస్థితిలో ఉండి పోయింది.ఈనాడు వార్తా పత్రికలో "దండలయ్యా .. దయ చూపండి" అంటూ వచ్చిన వార్తకు స్పందించి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డైరెక్టర్స్ వేణుగోపాల్ రెడ్డి మరియు లక్ష్మణ కుటాల అమడగూరు మండలం గాజులవారి పల్లిలో మానవ సేవ మాధవ సేవ అంటూ నిస్వార్థంగా శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమం ద్వారా సేవలు నిర్వహిస్తున్న శ్రీ అరుణ జ్యోతి గారికి విషయం తెలిపిన వెంటనే మానవతా దృక్పథంతో ఆమె స్పందించి ఈరోజు కదిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నుంచి ఆమెను ఆశ్రమానికి తీసుకొని వెళ్లడం జరిగింది. సహకరించిన పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి సార్ గారికి , ఐతీ. సిరి గారికి , అవుట్ పోస్ట్ A.S.I సురేంద్ర గారికి , హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

## ద్వారకాతిరుమలలో ముమ్మరంగా ఓటర్ల జాబితా సవరణ..
## ఇంటింటి సర్వేలో పాల్గొన్న కూటమి నాయకులు.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా**
**జూన్ 16 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఎస్ ఆర్ ప్రక్రియలో భాగంగా, మంగళవారం

ద్వారకాతిరుమల గ్రామంలో ఇంటింటి సర్వే జోరుగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్ల జాబితా పారదర్శకతలో భాగంగా జరుగుతున్న ఈ ప్రక్రియపై కీలక సూచనలు జారీ చేశారు.సర్వే కాలపరిమితి జూలై 14 వరకు నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు బి ఎల్ ఓ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు.ఎన్యుమరేషన్ ఫాంలు ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫాంలను అందిస్తారు. వీటిలో ఓటరు పాత ఫోటో, వివరాలు ముద్రించి ఉంటాయి. ఓటరు తన వివరాలను సరిచూసుకుని మిగిలిన ఖాళీలను పూర్తి చేయాలి. ధృవీకరణ పత్రాలు 2002 నాటి ఓటర్ల జాబితాను



ప్రాతిపదికగా తీసుకుని మ్యాపింగ్ చేస్తున్నారు. 2002 నాటి జాబితాలో పేరు ఉంటే, ఆ వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది, ఇతర పత్రాలేవీ అవసరం లేదు.కుటుంబ సభ్యుల వివరాలు ఒకవేళ పాత జాబితాలో పేరు లేకపోతే, కుటుంబ సభ్యుల తల్లిదండ్రులు, భార్య/భర్త వివరాలను


పొందుపరచాలి. ఆధార్, మొబైల్ నంబర్, కొత్త కలర్ ఫోటోలను జత చేయాలి.రసీదు పూర్తి చేసిన ఫాంలలో ఒక దానిపై బి ఎల్ ఓ సంతకం చేసి రసీదుగా ఇస్తారు. దీన్ని ఓటర్లు తప్పనిసరిగా భద్రపరుచుకోవాలి.జూలై 14 లోపు ఫాంలు సమర్పించని వారి పేర్లు, జూలై 21న విడుదలయ్యే ముసాయిదా జాబితాలో ఉండవు. కాబట్టి ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ఎవరైనా ఓటర్లు అందుబాటులో లేకపోతే, వారి కుటుంబ సభ్యులు వివరాలు నింపి సమర్పించవచ్చు.

జూలై 21- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.జూలై 21 - ఆగస్టు 20: క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ ఫాం-6, 7, 8 ద్వారా సెప్టెంబరు 22- ఓటర్ల తుది జాబితా ప్రచురణ.

ఓటర్లు తమ వివరాల కోసం సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌ను చూడవచ్చు లేదా సంబంధిత బి ఎల్ ఓ లను సంప్రదించవచ్చు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కూటమి నాయకులు, అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సాయిసన్నిధిలో రెండో రోజు మహోత్సవాలు వైభవంగా

**మహోత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి**







**చింతపల్లి, జూన్ 16 :జనసముద్రం న్యూస్ ప్రతినిధి**

చింతపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీ సాయిసన్నిధిలో జరుగుతున్న 19వ వార్షిక మహోత్సవాలు రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి.

ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, సాయిబాబా నామస్మరణతో పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ మహోత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటలకు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తు హోమం, మహా పాశుపత హవనములు నిర్వహించారు.

అనంతరంమూలమూర్తులకుఏకాదశరుద్రాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, నీరాజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా సాయిసన్నిధిలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించి వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు శ్రీ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, చింతపల్లి సాయిసన్నిధి ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయంగా మారిందని అన్నారు. సాయిబాబాఆశీస్సులతోరాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఆలయంలో అందిస్తున్న సేవలు, మహోత్సవాల నిర్వహణ తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కంకణాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సాయిసన్నిధి అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగాఆలయనిర్వాహకులనుఅభినందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు కంకణాల వెంకట్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులను శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ, మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ వార్షిక మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సాయిబాబా కృపాకటాక్షాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా మహా ర్యాలీకి తరలిన గోడకొండ్ల కళాకారులు



**చింతపల్లి, జూన్ 16 (జనసముద్రం న్యూస్):**

తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, జీవనోపాధి అభివృద్ధి కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ ర్యాలీ, సదస్సులో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామానికి చెందిన బ్యాండ్ కళాకారులు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు. తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం (బీవీకేఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది కళాకారులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోడకొండ్ల గ్రామంలో కళాకారులు సమావేశమై ర్యాలీ పోస్టర్లతో సంఘీభావం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌కు పయనమయ్యారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, బ్యాండ్ కళాకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, బీమా సౌకర్యం, పెన్షన్, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కళాకారుల కుటుంబాలకు ప్రభుత్వ పరిరక్షణ కల్పించి, వారి జీవనోపాధికి భరోసా ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసమే రాష్ట్రస్థాయి మహా సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో జరిగే ఈ భారీ ర్యాలీ, సదస్సు ద్వారా బ్యాండ్ కళాకారుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి వెళ్లి, వారి సంక్షేమానికి స్పష్టమైన హామీలు లభించాలని కళాకారులు ఆకాంక్షించారు. "కళాకారుల ఐక్యతే మా బలం హక్కుల సాధనే మా లక్ష్యం" అంటూ నాయకులు నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో బీవీకేఎస్ మండల అధ్యక్షుడు పడకంటి సుదర్శన్, ఉపాధ్యక్షుడు కొంగరి శివ, కార్యదర్శి పోలేపల్లి జంగయ్య, సహాయ కార్యదర్శి నాగిళ్ల మధుసూదన్, కోశాధికారి గ్యార శివకుమార్, అర్కపల్లి సోమయ్యతో పాటు సంఘం నాయకులు, బ్యాండ్ కళాకారులు, యువకులు పాల్గొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్యాండ్ వాయిద్య కళాకారుల హక్కుల సాధనకు ఈ మహా ర్యాలీ నాంది పలుకుతుందని, ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కళాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## లక్కీరెడ్డి పల్లి డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి తంబళ్లపల్లి ఎంపీడీవో గా పదోన్నతి





**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూన్ 16**

లక్కిరెడ్డిపల్లి మండలంలో డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వర్తిస్తున్నటువంటి ఉషారాణి తంబళ్లపల్లి కి ఎంపీడివో గా పదోన్నతి పొందిన సందర్భంగా మండలంలో ఉన్నటువంటి పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది అందరూ ఉషారాణికి వీడ్కోలు సభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు మండలతెలుగు యువత అధ్యక్షుడు కొలిమి పకీరయ్య మాట్లాడుతూ ఉషారాణి మండలంలో చాలా మంచి పేరు సంపాదించారని ప్రజలు ఎటువంటి సమస్యతో మండల ఆఫీసుకు వచ్చిన వారి సమస్యను దగ్గరుండి పరిష్కరించి పంపించేవారని తెలియజేశారు ఇకనుంచి పదోన్నతి పొంది తంబళ్లపల్లెకు ఎంపీడీవో గా వెళుతున్నటువంటి ఉషారాణి అక్కడ కూడా మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన కోరాడు మండల కార్యదర్శులు, వీఆర్వోలు, ఆమెను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు







Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram